ప్రజాశక్తి
మంగళవారం 4 జులై 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

జలరవాణాకు పచ్చజెండా

- రాయపూడి-ఇబ్రహీంపట్నం మధ్య లాంచీలు
- జెడ్‌పి అనుమతితో నిర్వాహకుల ఏర్పాట్లు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

కృష్ణానదిలో లాంచీల ప్రయాణానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. గుంటూరు జిల్లా రాయపూడి, కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నం వరకు లాంచీల నిర్వహణకు జిల్లా ప్రజా పరిషత్ ఇటీవల నిర్వహించిన టెండర్లలో రూ.21.50 లక్షలతో అలపర్తి శ్రీరాం ప్రసాద్ టెండరు కైవసం చేసుకున్నారు. ఈ మేరకు త్వరలో లాంచీలను పునరుద్ధరిస్తామని శ్రీరాం ప్రసాద్ తెలిపారు.

ఆరేళ్ల క్రితం తూర్పు గోదావరి జిల్లా కచ్చులూరు వద్ద లాంచీ ప్రమాదం తరువాత నదుల్లో లాంచీల ప్రయాణాన్ని ప్రభుత్వం నిలిపేసింది. సుదీర్ఘకాలం తరువాత తిరిగి గతనెలలో అనుమతించడంతో లాంచీల నిర్వహణను పర్యవేక్షిస్తున్న జిల్లా పరిషత్ ఇందుకు సంబంధించి టెండర్లు పిలిచింది. రాయపూడి నుంచి ఇబ్రహీంపట్నంకు రోడ్డు మార్గంలో అయితే 50 కిలో మీటర్ల దూరం ఉంది. జలరవాణ మార్గంలో అయితే ఐదు కిలో మీటర్ల దూరంలో వెళ్లే అవకాశం ఉంది. 20 నిమిషాల్లో రాయపూడినుంచి ఇబ్రహీంపట్నం వెళ్లవచ్చునని నిర్వాహకులు చెబుతున్నారు. గతంలో లాంచీల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులు రవాణా చేసేవారు. వివిధ రకాల ఉత్పత్తుల రవాణాతో పాటు పర్యాటకులను, సాధారణ ప్రయాణికులను కూడా లాంచీల్లో చేరవేసేందుకు అవకాశం ఉంది. లాంచీల ద్వారా ప్రయాణంతో ప్రకృతి అందాలను కూడా వీక్షించవచ్చు. అయితే ఈ లాంచీలకు కొద్దికాలం మాత్రమే డిమాండ్ ఉంటుందని చెబుతున్నారు.

ప్రస్తుతం మంగళగిరి మండలం కాజ నుంచి ఏలూరు జిల్లా గుండుగొలను వరకు జాతీయ రహదారికి అనుసంధానంగా బైపాస్ నిర్మాణం జరుగుతోంది. ఇందులో భాగంగా తుళ్లూరు మండలం వెంకటపాలెం నుంచి విజయవాడకు సమీపంలోని గొల్లపూడి వరకు కృష్ణానదిపై వంతెన నిర్మాణం వేగంగా జరుగుతోంది. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే ప్రతి ఒక్కరూ రోడ్డు మార్గంలో ఎన్‌టిఆర్ జిల్లాలోకి ప్రవేశించే అవకాశం ఉంది. ఇందువల్ల లాంచీలకు కొద్ది కాలమే డిమాండ్ ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

రాజధాని అమరావతి ఏర్పడక ముందు ఈ ప్రాంతంతో మూడు పంటలు పండేవి. వీటిల్లో పూలు, పండ్లు, కాయలు ఎక్కువగా ఉత్పత్తి జరిగేది. ఈ నేపథ్యంలో వీటిని లాంచీల ద్వారా ఈ ఒడ్డు నుంచి ఆ ఒడ్డుకు చేర్చేవారు. కొంత కాలంగా లాంచీలు లేకపోవడం, రాజధాని గ్రామాల్లో భూములన్నీ సిఆర్‌డిఎ తీసుకోవడం వల్ల వ్యవసాయ కార్యకలాపాలు ఆగిపోయాయి. ▶ 2లో

గుంటూరులో కుండపోత

ఎండతీవ్రత నుంచి ఉపశమనం

గుంటూరు,పల్నాడు జిల్లాలో భారీ వర్షం

ప్రజాశక్తి -గుంటూరు జిల్లా ప్రతినిధి

నైరుతీ రుతు పవనాల ప్రభావంతో గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో సోమవారం మధ్యాహ్నం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. గుంటూరులో కుండపోతగా వర్షం కురవడంతో పలు ప్రాంతాల్లో రోడ్లపై వర్షం నీరుపారింది. పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గుంటూరు, కాకుమాను, మేడికొండూరు, పొన్నూరు, వట్టిచెరకూరు, ముప్పాళ్ల, రొంపిచర్ల, శావల్యాపురంలో భారీ వర్షం కురిసింది. మిగతా ప్రాంతాల్లో ఒక మోస్తరుగా వర్షం కురిసినట్టు సమాచారం అందింది. మేడికొండూరులో గత నెలలో జిల్లా మొత్తం మీద అధిక వర్షం కురవడం వల్ల రైతులు సేద్యానికి సిద్ధం కాగా తాజాగా కురిసిన వర్షంతో రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత పది రోజులు వర్షాల జాడలేక ఎండల తీవ్రతతో అల్లాడిన ప్రజలకు భారీ వర్షంతో చల్లటి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడింది. మరో వైపు వర్షాలతో జగనన్న కాలనీల్లో నీరు చేరింది. గుంటూరు,కాకుమాను, మేడికొండూరు పరిసరాల్లోని జగనన్న కాలనీల్లో నీరు చేరి నిర్మాణ పనులకు ఆటంకం కల్గించింది. జూన్ నెలలో గుంటూరు,పల్నాడు జిల్లాల్లో చాలావరకు సాధారణ వర్షంపాతం నమోదు కాగా 27 మండలాల్లో లోటు పరిస్థితి ఏర్పడింది. తాజా వర్షాలతో గతనెలలో వర్షాలు కురవని ప్రాంతాల్లో ఇప్పుడు కురుస్తున్న వర్షంతో రైతులకు కొంత ఉపశమనం కల్గింది. మంగళవారం కూడా వర్షాలు కొనసాగే

అవకాశంఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. గుంటూరు జిల్లాలో జూన్ నెల మొత్తం 97.1 మిల్లీ మీటర్లవర్షం కురవాల్సి ఉండగా ఇప్పటివరకు 105.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. పల్నాడుజిల్లాలో జూన్ నెలలో 80.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 81.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయింది. దీంతో ఇంకా సేద్యం ప్రారంభించడానికి రైతులు తటపటాయిస్తున్నారు. ప్రస్తుతం గుంటూరు జిల్లాలో ఇంకా సేద్యం ఊపందుకోలేదు. పల్నాడు జిల్లాలో 3.04 లక్షల ఎకరాలకు గాను 20 వేల ఎకరాల్లో పత్తి విత్తనాలు నాటారు. భారీ వర్షాలు రెండు రోజులు కొనసాగితే సాగుకు ఉపయోగంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ధర్నా చేస్తున్న ఉద్యోగులు

పిఎసిఎస్‌లపై ప్రైవేటు పెత్తనం వద్దు

- 1964 చట్టానికి సవరణలను రద్దు చేయాలి
- ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి
- ఐక్య వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ధర్నాలో సహకార సంఘాల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐక్య వేదిక నాయకులు మువ్వా వెంకటేశ్వరరావు, పి.వెంకటరెడ్డి, జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై రానున్న రోజుల్లో దశల వారీ ఉద్యమం చేపట్టినట్లు చెప్పారు. గ్రామాల్లో పిఎసిఎస్‌లలో రైతులు మాత్రమే వాటాదారులుగా ఉండాలని, 50 శాతం వాటాలను ప్రైవేటు వ్యక్తులకు, కంపెనీలకు ఇస్తూ 1964 చట్టానికి చేసిన సవరణను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు రైతుల ▶ 2లో

పోలవరం పోరుకేక యాత్రలో సిపిఎం జిల్లా నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

పోలవరం ముంపు ప్రాంత నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వంలో జరుగుతున్న పోలవరం పోరుకేక పాదయాత్రకు గుంటూరు జిల్లా సిపిఎం నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ మేరకు పాదయాత్రలో సోమవారం సిపిఎం జిల్లా నాయకులు ఈమని అప్పారావు, ఎం.రవి, ఎం.ఎ.చిష్టి, వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పింఛను మంజూరు చేయనందుకు సస్పెన్షన్

సచివాలయ వెల్ఫేర్ సెక్రెటరీపై చర్యలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

విధుల్లో అలసత్వం వహించిన కారణంగా నరసరావుపేట మండలం పెద్దిరెడ్డిపాలెం గ్రామ సచివాలయ వెల్ఫేర్ - ఎడ్యుకేషన్ సెక్రెటరీ పాముల మంజులతను సస్పెండ్ చేయాలని జిల్లా సాంఘిక సంక్షేమాధికారి ఓబుల నాయుడును పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సోమవారం ఆదేశించారు. నరసరావుపేట నియోజకవర్గ పరిధిలోని కేతముక్కల అగ్రహారం ▶ 2లో

జిజిహెచ్‌లో సమస్యలపై దృష్టి పేజీ 8

అరాచకం తప్ప అభివృద్ధి ఏది?

బస్సు యాత్రలో వైసిపిపై టిడిపి నేతల ధ్వజం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రాష్ట్రంలో వైసిపి పాలనలో అరాచకం తప్ప అభివృద్ధి జాడలేదని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్య రథయాత్ర' టిడిపి నియోజకవర్గం ▶ 2లో

మాట్లాడుతున్న నక్కా ఆనందబాబు

ప్రభుత్వ పథకాలపై సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను సత్వరం పూర్తి చేస్తూనే, ప్రభుత్వం పలు ప్రభుత్వ సంక్షేమ పథకాలలో తీసుకువచ్చిన నూతన విధానాలను అమలు చేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని ఎస్ ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో పలు శాఖల జిల్లా అధికారులతో అంతర్గత సమీక్ష సమావేశం, రెవెన్యూ డివిజన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రభుత్వ పథకాలపై సమీక్ష చేశారు.

మజీద్, ఉర్దూఘాట్ కోసం స్థలం కేటాయింపు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

మండలంలోని మునిపల్లిలో మజీద్, ఉర్దూ ఘాట్ కోసం ప్రభుత్వం నుండి నాలుగు సెంట్లు స్థలాన్ని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మంజూరు చేయిం చారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా స్థల పత్రాలను మత పెద్దలకు సోమవారం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాటాడుతూ ముస్లిం మైనార్టీ సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సర్పంచ్ కూచిపూడి స్వరూపా రాణి ముస్లిం మత పెద్దలు షేక్ రహంతుల్లా వైసిపి నాయకులు సత్కరించారు.

పైపులైన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని రన్నింగ్ రూమ్ సెంటర్ వడ్డెర కాలనీ వద్ద మంచినీటి కనెక్షన్లు ఇవ్వని మెయిన్ పైప్ లైన్ పనులు జరుగుతున్న తీరును ఎంటిఎంసి అధికారులు పరిశీలించారు. తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విషయం సోషల్ మీడియాతో పాటు ప్రింట్ మీడియాలో వచ్చింది. దీనిపై ఎంటిఎంసి కమిషనర్ యు.శారదా దేవి స్పందించారు. కమిషనర్ ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి ఆ ప్రాంతానికి చేరుకుని ఇంజనీరంగ్ సిబ్బందితో చర్చించారు. రెండు రోజుల్లో మంచినీటి పైపులైన్ల పనులు పూర్తిచేసి ఎస్సి కాలనీ ప్రజలకు మంచినీరు అందించే ఏర్పాట్లు చేస్తామని చెప్పారు.

ధనుంజయరావుకు కొల్లు రవీంద్ర పరామర్శ

ప్రజాశక్తి-మంగళగిరి

స్థానిక డాక్టర్ ఆంజనేయ కాలనీలో ఇటీవల ప్రమాదానికి గురై ఇంటి వద్ద చికిత్స పొందుతున్న టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయ రావును టిడిపి రాష్ట్ర బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు కొల్లు రవీంద్ర సోమవారం పరామర్శించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, బీసీ వర్గాలను, ముఖ్యంగా చేనేత రంగాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా దెబ్బతీసిందని విమర్శించారు. బీసీలకు ఏదో చేస్తున్నామని చెప్పి 56 కార్పొరేషన్లు పెట్టి కూర్చోవ డానికి కుర్చీ కూడా లేకుండా వారిని అవమానిస్తున్నారని ఆరోపించారు. మంగళగిరి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కె.అంకమ్మ రావు, పద్మశాలి సాధికార కమిటీ రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ టి.బాపనయ్య, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు వి. మాధవరావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ వి.లక్ష్మయ్య, జె.బాలకృష్ణ పాల్గొన్నారు.

‘108’ సిబ్బంది సేవలు అమూల్యం

ప్రజాశక్తి-దుగ్గిరాల

వాహనాన్ని ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు

108 సిబ్బంది సేవలు అమూల్యమైనవని ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి జడ్పిటిసి మేకతోటి అరుణ కొనియాడారు. అత్యంత అధునాతన పరికరాలతో కూడిన కొత్త 108 వాహనాన్ని స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద వారు సోమవారం ప్రారంభించారు.ఇప్పటివరకు సేవలు అందించిన పాత వాహనం స్థానే ప్రభుత్వం కొత్త వాహనాన్ని కేటా యించింది. 108 వాహనం ఆపద సమయంలో అందిస్తున్న వైద్య సేవలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా పైలెట్లు శ్రీనివాసరావు, ప్రసాద రాజు ఇఎంటి. ఆనంద్, హరిబాబు, విజయ్ లను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుసుమ శ్రీదేవి, సూపరింటెండెంట్ డి.వీరయ్య వైసిపి నాయకులు డి.వెంకటేశ్వరరావు, షేక్ నాగూర్, కర్ర్యా రావు పాల్గొన్నారు.

సాయిబాబా దేవస్థానంలో అన్నదానం

ప్రజాశక్తి-గుంటూరు

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్, తులసి ధర్మచరణ్

గురుపౌర్ణమి సందర్భంగా గోరంట్ల మెయిన్ రోడ్డులోని సాయిబాబా దేవస్థానంలో గోరంట్ల మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణు గోపాల్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మ చరణ్ కలిసి ప్రారంభించారు. కార్య క్రమంలో కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి, యర్రంశెట్టి సూరి, తోట రంగారావు పాల్గొన్నారు.

రామాంజనేయపురంలో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-బెల్లంకొండ

పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో సంస్కరణలు తెచ్చారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బెల్లంకొండ మండలం వెంక టాయపాలెం, రామాంజనేయపురం గ్రామాల్లో ఎమ్మెల్యే రెండో రోజు పర్యటించారు. ముందుగా రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలను ఇంటిం టికి తిరిగి అందించారు. వాలంటీర్ల సేవలపై ఆరా తీశారు. స్థానికంగా సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత

ప్రజాశక్తి - వినుకొండ

శావల్యాపురం మండలంలోని పొట్లూరు గ్రామం ఎస్సీ కాలనీలోని తంగిరాల ఈశ్వరరావు నిరుపేద కుటుంబం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ద్వారా అగ్ని ప్రమాదాన్ని గురై కట్టుబట్టలతో ఇబ్బంది పడుతోంది. శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో సోమవారం అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం, బియ్యం, వంట సామాగ్రి, బట్టలు అందజేశారు. అగ్ని ప్రమాద బాధితులకు తాము అండగా ఉంటామని జీవి ఆంజనేయులు ఫోన్ ద్వారా భరోసా ఇచ్చారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

2023 24 రోటరీ సంవత్సరానికి ఎన్నిక కాబడిన రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం సాయంత్రం చినకాకాని లిటిల్ విలేజ్ హెూటల్ లో జరిగింది. రోటరీ జిల్లా గవర్నర్ డాక్టర్ బూసి రెడ్డి శంకర రెడ్డి, నూతన అధ్యక్షులుగా అందే రేవంత్, కార్యదర్శిగా గాజుల శ్రీనివాసరావు, కోశాధికారి గా నూతలపాటి వెంకటేశ్వరరావు, 16 మంది డైరెక్టర్లచే ప్రమాణ స్వీకారం చేయించారు. శంకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరం కొత్త కార్యవర్గం సమాజ హితం కోసం మరింత విస్తృతంగా పని చేయాలని సూచించారు. రేవంత్ మాట్లాడుతూ ఈ ఏడాది గ్లోబల్ గ్రాంట్లు, సిఎస్ఆర్ నిధుల సహాయంతో మంగళగిరి ప్రాంత ప్రజల అవసరాలు తీర్చడం కోసం మరింత మెరుగైన సర్వీస్ ప్రాజెక్టులను చేపట్టాలని నూతన కార్యవర్గం సంకల్పించినట్లు చెప్పారు. నూతనంగా క్లబ్ సభ్యత్వం స్వీకరించిన వారిచే అసిస్టెంట్ గవర్నర్ వై.వేణుగోపాల్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో చార్టర్ ప్రెసిడెంట్ అనిల్ చక్రవర్తి, పూర్వ అధ్యక్షులు డాక్టర్ వంశీకృష్ణ, సతీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించండి

ప్రజాశక్తి-మంగళగిరి

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ టిడిపి తెలుగు మహిళల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. గడిచిన నాలుగేళ్లలో వైసిపి ప్రభుత్వం యాభై వేల కోట్ల రూపాయలను ప్రజలపై విద్యుత్ బారాలు మోపిందని విమర్శించారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించకపోతే ఉద్యమం చేపడతామని మహిళలు హెచ్చరించారు.

కుట్టు మిషన్లు పంపిణీ

ప్రజాశక్తి-మంగళగిరి

స్త్రీ శక్తి పథకంలో భాగంగా శిక్షణ పొందిన 40 మంది మహిళలకు సోమవారం మంగళగిరి నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో మిషన్లు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి తెలుగు మహిళ నాయకురాలు టి.జానకి దేవి, ఎ. జై సత్య, వి.ఆశా బాల, ఎం. వైష్ణవి, కె.మహాలక్ష్మి, కె.మౌనిక, ఎ.కుసుమ పాల్గొన్నారు.

జలరవాణాకు పచ్చజెండా

(మొదటి పేజీ తరువాయి)

కృష్ణానదిలో జలరవాణాకు 100 ఏళ్ల చరిత్ర ఉందని, స్వాతంత్ర్యం రాక ముందు గతంలో నాటుపడవలు ఎక్కువగా వినియోగించే వారని, అప్పట్లో నదీ ఉధృతి అంతగా లేదని రాయపూడి వాసులు గుర్తు చేసుకుంటున్నారు. ప్రస్తుతం నదీ ప్రవాహ ఉధృతిని బట్టి అధికారులు ఎప్పటికప్పుడు ఇచ్చే సూచనల మేరకు లాంచీలను నడుపుతామని కాంట్రాక్టరు శ్రీరాం ప్రసాద్ తెలిపారు. డ్రైవర్లకు బీమా చేశామని, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు.

పిఎసిఎస్‌లపై ప్రైవేటు పెత్తనం వద్దు

(మొదటి పేజీ తరువాయి)

భాగస్వామ్యంతో నిర్వహించే సంఘాలు ప్రైవేటు వ్యక్తుల ఆధిపత్యంలోకి వెళ్లకూడదన్నారు. జిఒ 36, 90 ప్రకారం వేతనాలు అమలు చేయాలని, 2016 ఏప్రిల్ 1 నుండి మోనిటరీ బెన్ఫిట్స్ చెల్లించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్లు, గ్రాట్యుటీ అమలు చేయాలని కోరారు. హెచ్ఆర్ పాలసీని పూర్తి స్థాయిలో అమలు చేయటానికి గతంలో మాదిరిగా ప్రభుత్వం, బ్యాంకులు, సంఘాలు కలిపి క్యాడర్ ఫండ్ ఏర్పాటు చేయాలని, ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చిన తర్వాతే బదిలీలు చేయాలని స్పష్టం చేశారు. డిఎల్ఇసి చేసిన ట్రాన్స్‌ఫర్లను పాలకవర్గం తిరస్కరిస్తే ఆ ఉద్యోగికి న్యాయం చేయటానికి డిఎల్ఇసిలో చట్టభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పిఎసిఎస్ ఉద్యోగుల వేతన సవరణ ప్రభుత్వంతో సంబంధం లేకుండా, డిసిసిబి ఉద్యోగుల మాదిరిగా ప్రత్యేక కమిటీ ద్వారా ప్రతి ఐదేళ్లకోసారి నిర్ణయించాలన్నారు. 2019 ఏప్రిల్ 1 నాటి వేతన సవరణ తక్షణమే చేసి, సవరణ జీతాలు అమలు చేయాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, సహకార సంఘాల్లో ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. ధర్నా అనంతరం స్పందనలో అర్జీ అందచేశారు.

పింఛను మంజూరు చేయనందుకు సస్పెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

గ్రామానికి చెందిన బోయపాటి జయంతిబాబు అనే వృద్ధుడు సచివాలయ వాలంటీర్, వెల్ఫేర్ సెక్రెటరీలను పలుమార్లు కలసి పింఛను కోసం విన్నవించగా సచివాలయ సెక్రెటరీ, వాలంటీర్ ఇద్దరూ పట్టించుకోకపోవడంతో బాధితుడు జిల్లా కలెక్టర్‌కు ‘జగనన్నకు చెబుదాం’లో ఫిర్యాదు చేశారు. దీనిపై సచివాలయ వెల్ఫేర్ సెక్రెటరీతో కలెక్టర్ మాట్లాడి.. స్థానిక పరిస్థితులను అడిగి తెలుసుకుని వృద్ధునికి పింఛను వచ్చేలా చూడాలన్నారు. అయినా పెన్షన్ మంజూరు చేయక పోవడంతో చర్యలకు కలెక్టర్ ఆదేశాలిచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెన్షన్ చేసి ఆర్డరు కాపీ పంపుతున్నట్లు ఓబులు నాయుడు తెలిపారు.

అరాచకం తప్ప అభివృద్ధి ఏది?

(మొదటి పేజీ తరువాయి)

ఇన్‌ఛార్జి నశీర్ అహ్మద్ ఆధ్వర్యంలో సోమవారం వివిధ ప్రాంతాల్లో జరిగింది. కన్యకాపరమేశ్వరి దేవాలయం వద్ద బస్సు యాత్రను ప్రారంభించగా అనంతరం పాత గుంటూరు పోలీస్‌స్టేషన్, ఎన్టీఆర్ ఐలాండ్, మూతపడిన అన్న క్యాంటీన్, ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణ, పాడుబడిన గుంటూరు నగరపాలక సంస్థ భవనాలు, బీఆర్ స్టేడియం, ఎన్టీఆర్ మానస సరోవరం వద్ద మాజీమంత్రులు పత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనంద్‌బాబు, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తదితరులు సెల్ఫీ ఛాలెంజ్‌లో పాల్గొన్నారు. సంగడిగుంట వద్ద జరిగిన రచ్చబండలో పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ బటన్‌లు నొక్కి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెబుతున్నాని, అయితే సంక్షేమ పథకాల పేరుతో అప్పులు తెచ్చి ఆ తర్వాత ఇష్టారీతిన దోచుకుంటున్నారని విమర్శించారు. టిడిపి హయాంలో గుంటూరులో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేస్తే ఇప్పుడు నగరం అధోగతికి వెళ్లిపోయిందన్నారు. రాజధాని అమరావతి నిర్మాణ పనులను ఆపేశారని, ఇది ప్రజాదోహంతో సమానమని ధ్వజమెత్తారు. నక్కా ఆనంద బాబు మాట్లాడుతూ అన్ని వర్గాల శ్రేయస్సు కోసమే టిడిపి మినీ మేనిఫెస్టో రూపొందించిందన్నారు. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తూనే సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు.

ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ టిడిపి చేపట్టిన సంక్షేమ పథకాలు రద్దుచేసి కొద్ది మందికి జగన్ పథకాలు ఇస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి గుంటూరు, పల్నాడు జిల్లాల అధ్యక్షులు టి.శ్రావణ్‌కుమార్, జి.వి.ఆంజనేయులు, నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, దాసరి రాజామాస్టారు, ఆర్.సాయి, బి.రాంప్రసాద్ పాల్గొన్నారు.

అదనపు కట్నం తేలేదని.. ఆడపిల్లలు పుట్టారని..

భర్త, అత్తింటి వారి నుండి ప్రాణహాని ఉందని మహిళల ఫిర్యాదులు

సమస్యలు వింటున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యమిచ్చి సత్వరమే పరిష్కరించాలని, ప్రతి ఫిర్యాదుపట్ల శ్రద్ధ వహించాలని పోలీసులను పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగన్నన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుండి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. అర్జిదార్లకు నరసరావుపేట పట్టణానికి చెందిన, శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానం చైర్మన్ వేలమూరి రామకృష్ణారెడ్డి భోజనం సమకూర్చారు. అన్నదానం ఆర్గనైజర్స్ బచ్చు వెంకట సత్యనారాయణతో కలిసి ఎస్పీ భోజనం వడ్డించారు. ఎఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు, ఎఆర్ డీఎస్పీ చిన్నికష్ణ, డీఎస్పీలు పి.రాజు, బి.ఆదినారాయణ, యు.రవిచంద్ర, సిఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం కత్తిపీటతో దాడి

13 ఏళ్ల క్రితం వివాహం చేసుకోగా తన భర్త మద్యానికి బానిసై రోజు తనని వేధిస్తూ కట్నం కోసం వేధిస్తున్నాడని, ఇంటి నుంచి బయటికి వెళ్లాలంటూ బెదిరిస్తున్నాడని గోనెపూడికి చెందిన లక్ష్మీదుర్గ ఫిర్యాదు చేశారు. తనపై కత్తి పీటతో దాడి చేశాడని, ఆయనకు అత్త, మామ ఆడబిడ్డ, ఆమె భర్త సహకరించారని చెప్పారు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం లేదన్నారు.

ఆడపిల్లలు పుట్టారని హత్యకు కుట్ర

ముగ్గురు ఆడపిల్లలకు జన్మనిచ్చానని అత్తమామ, ఆడపడుచులు, ఆమె బిడ్డలు నిత్యం వేధిస్తున్నారని, హత్యకూ యత్నించారని ఈపూరు మండలం కుంచనపల్లికి చెందిన మైదుకూరి అంజలి ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని భర్తకు చెబితే అన్నంలో విషం పెట్టి పిల్లలతో సహా నన్ను కూడా చంపేస్తామని భయపెడుతున్నారని, ఈపూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలనుకుంటే తనపై అత్తింటివారే ముందుగా కేసు పెట్టారని వాపోయారు. తనకు ప్రాణహాని ఉందని, ఎస్ఐ సైతం నిజానిజాలపై విచారణ చేయడం లేదని చెప్పారు.

అన్నపై తమ్ముడు ఫిర్యాదు

తన సోదరుడు బ్యాంకులో రుణం తీసుకునే క్రమంలో సంతకం పెట్టానని, నాలుగేళ్లయినా రుణం చెల్లించకపోవడంతో తన ఖాతాను బ్యాంక్ అధికారులు నిలిపేశారని దుర్గి మండలం లింగజపురానికి జక్కా యలమందపై వెంకయ్య ఫిర్యాదు చేశారు. ఉద్యాన పంటలకు సంబంధించిన రాయితీ నగదు తన ఖాతాలో ఉన్నాయని, ప్రస్తుతం తన భార్య అనారోగ్యంతో ఉన్న నేపథ్యంలో తన నగదు తీసుకునే వెసులుబాటు కల్పించాలని కోరారు.

124. రైతుల వద్ద రూ.3 కోట్లు తీసుకుని మోసం

చిన్న సన్నకారు రైతుల వద్ద రూ 3 కోట్లకు పైగా అప్పులు తీసుకుని మొహం చాటేసిన నకరికల్లు మండలం నర్సింగపాడుకు చెందిన బొడ్డు తిరుపతిరెడ్డిపై రైతులు ఫిర్యాదు చేశారు. పిల్లల చదువుల పేరిట అప్పులు అడిగాడని, గ్రామంలో 10 ఎకరాల పొలంతో పాటు నెల్లూరు జిల్లాలో మరో 12 ఎకరాలు భూమి ఉందని చెప్పి డబ్బులు తీసుకున్నాడని అన్నారు. 2 నెలలుగా కుటుంబంతో సహా ఏటో వెళ్లిపోయాడని గ్రామంలోని భూమిని బంధువుల పేరిట రిజిస్ట్రేషన్ చేశాడని తెలిసిందని చెప్పారు. ఫిర్యాదు చేసిన వారిలో శివారెడ్డి, అంకమ్మ, సుబ్బులు, బెజ్జం పెద్దరెడ్డి, వెంకటరెడ్డి, నాగులు, సీత రమమ్మ, రమణారెడ్డి ఉన్నారు.

వీటితోపాటు ఇతర సమస్యలపైనా ఫిర్యాదుల వచ్చాయి. తోటి రైతు పొలంలో వ్యర్థాలను దహనం చేస్తుంగా ఆ మంటలు తన పొలానికీ వ్యాపించాయని, ఇందుకు పరిహారం ఇస్తానని చెప్పిన వ్యక్తి ఇవ్వకుండా హేళనగా మాట్లాడాడని అచ్చంపేట మండలానికి చెందిన ఒకరు ఫిర్యాదు. చేశారు. కొత్త శ్రీనివాసరావు అనే వ్యక్తి స్థలాన్ని అద్దెకు తీసుకుని నిర్ణీత సమయం గడిచాక ఖాళీ చేయమని చెప్తే ఆ స్థలం మాది అని దౌర్జన్యం చేస్తున్నారని కోర్టు ద్వారా ఆర్డర్ తెచ్చుకొని సదరు స్థలంలోకి వెళ్ళగా తమను కొట్టి నెట్టివేశారని దుర్గి మండలానికి చెందిన ఒకరు ఫిర్యాదు చేశారు. ఇల్లు బాగు చేసుకుంటున్నానని, కొన్ని రోజులు ఇంటిలో ఉంటానని చెప్పి తర్వాత ఆ ఇంటిని ఖాళీ చేయకుండా తమనే బెదిరిస్తున్నారని ఎడ్లపాడు మండలం తిమ్మాపురానికి చెందిన మహిళ వాపోయారు.

మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 41,548
మిర్చి ఎగుమతి	: 39,692
మిర్చి నిల్వ	: 18,124

మిర్చి ధరలు

	రూపాయలలో
334	9,500 - 23,000
నెం.5	10,000 - 21,200
273	17,000 - 21,000
341	9,500 - 22,000
సూపర్ 10	20,800 - 20,800
నాన్ ఎసి	
తేజ	9,000 - 25,000
బడిగి	9,500 - 26,000
దేవనూరు డీలక్స్	13,500 - 19,000
తాలుకాయలు	5,000 - 14,000
ఎసి	
334	15,000 - 23,000
341	14,000 - 23,500
తేజ	11,000 - 25,200
బడిగి	17,000 - 19,500
తాలుకాయలు	5,000 - 13,000

భర్త ఆత్మహత్య చేసుకున్నాడని భార్యా...

ప్రజాశక్తి - దుగ్గిరాల

భర్త ఆత్మహత్యకు పాడ్పడ్డారని మనస్థాపం చెంది భార్య పురుగుమందు తాగిన యువతీ మృతి చెందింది. మండల కేంద్రమైన దుగ్గిరాలలోని ఎస్సీ కాలనీకి చెందిన కొమ్మాలపాటి ఆనంద్, తెనాలి మండలం కటెవరానికి చెందిన వెన్నెల మూడేళ్ల కిందట ప్రేమ పెళ్లి చేసుకున్నారు. 20 రోజుల క్రితం ఆనంద్ పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాడ్పడ్డాడు. దీంతో మనస్థాపానికి గురైన వెన్నెల (23) గత నెల 29వ తేదీ పురుగుమందు తాగింది. అప్పటి నుండి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఆదివారం రాత్రి మరణించారు. ఎఎస్ఐ అబ్దుల్ సత్తార్ కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబానికి అప్పగించారు.

ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి తెనాలి

పట్టణంలోని పాండురంగపేటకు చెందిన యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఉదయ బాబు (19) అదే ప్రాంతానికి చెందిన యువతిని ప్రేమించాడు. అయితే యువతి తల్లిదండ్రులు వారి ప్రేమను అంగీకరించలేదు. పైగా యువతికి మరొకరితో వివాహం జరిపించారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఉదయబాబు ఆదివారం రాత్రి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి స్థానిక జిల్లా వైద్యశాలకు తరలించగా, మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూన్న సోమవారం మృతి చెందాడు.

రైల్వే ట్రాక్‌పై యువకుని మృతదేహం

ప్రజాశక్తి - నకరికల్లు

రైల్వే ట్రాక్‌పై అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన నకరికల్లులో సోమవారం జరిగింది. పోలీసులు, మృతుని బంధువుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎర్రంశెట్టి మల్లికార్జునరావు (23) భవన నిర్మాణ పనులు చేస్తుంటాడు. ఆదివారం ఇంటి నుండి వెళ్లిన మల్లికార్జునరావు తిరిగి రాలేదు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున స్థానిక నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ పరిసరాల్లో వాకింగ్ కోసం వచ్చిన వారు ట్రాక్‌పక్కన మృతదేహాన్ని గమనించారు. వెళ్లి పరిశీలించగా మృతుడు మల్లికార్జునరావుగా తేలింది. మృతదేహంపై గాయాలు ఉండడం, శరీరంపై మట్టి, పక్కనే ద్విచక్ర వాహనం పడేసి ఉండడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నరసరావుపేట రైల్వే పోలీస్ ఇన్‌ఛార్జి బి.పూర్ణమహేశ్వరరావు తెలిపారు. ఇదిలా ఉండగా మృతునికి ఒక సోదరుడు ఉన్నాడు. తండ్రి నెల మేనెలలోనే చనిపోయాడు.

CHANGE OF NAME

I, CHANDOLU KOTESWARAMMA alias CHANDOLU KIRANMAYE, W/o Chandolu Venkata Sri Hari Resident of D.No:12-13-15/A, Kuglar Hospital Road, Kothapet, Guntur, Guntur District-522001, AP, Hence I Have both names are of one and the same person as CHANDOLU KOTESWARAMMA alias CHANDOLU KIRANMAYE.

ఇంటర్మీడియట్ ఒరిజినల్ సర్టిఫికెట్ పోయినది

గద్దె షాలిని డాటర్ ఆఫ్ గద్దె ప్రభాకర్ రావు డోర్ నెంబర్ 1-25/ఎ నాగులపాడు గ్రామం, పెదనందిపాడు మండలం, గుంటూరు జిల్లా, ఈమెకు చెందిన ఇంటర్మీడియట్ ఒరిజినల్ లాంగ్ మెమో సర్టిఫికెట్ 30-06-2023వ తేదీన నాగులపాడు నుండి పెదనందిపాడు బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద ఉన్న జిరాక్స్ సెంటర్‌కు జిరాక్సులు తీయించు నిమిత్తం సంచిలో పెట్టుకొని బైకు మీద వస్తూ ఉండగా మార్గమధ్యమంలో పోయినవి. ఎంత వెతికినా కనపడలేదు. ఎవరికైనా దొరికిన యెడల ఈ నెంబర్కు తెలియపరచగలరు ఫోన్ నెంబర్ **9866728310.**

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన గుంటూరుసిటీ, గుజ్జనగుండ్ల కరెంటు ఆఫీస్ ఎదురు, మయూరి నందన అపార్ట్‌మెంట్ నందలి 5వ ఫ్లోర్, ప్లాట్ నెం. 403 కాపురస్తులు కన్నేటి వెంకటేశ్వర్లు గారి సూచనల మేరకు యావన్మందికి తెలియేయునది ఏమనగా, నా క్లయింట్ చిన్న కుమారుడైౌన కన్నేటి హేమంత్ సాయి అను అతను చిత్తూరు యూనివర్శిటీలో ఎం.బి.ఎ. చదువుతూతన ప్రవర్తన సక్రమంగా తెలిసిన వారందరి వద్ద అప్పులు చేయుచూ, సదరు అప్పులు నా క్లయింటు చెల్లిస్తాడని చెప్పుచున్నందున, నా క్లయింటు తన చిన్నకుమారుడుని ఎన్నిసార్లు హెచ్చరించిననూ తన తీరు మార్చుకొనక అప్పుల వారిని ఇంటిమీదకు పంపించుచూ, నానా ఇబ్బందులకు గురి చేస్తున్నందున, నా క్లయింట్ చిన్న కుమారుడు యొక్క ప్రవర్తన సక్రమంగా లేనందున అతను చేసినటువంటి అప్పులు, బాకీలకు గానీ, ఇతర కార్యక్రమాలకు లేదా చేసిన బాకీలు వగైరాలకు నా క్లయింటు ఎటువంటి బాధ్యత వహించడని, అట్లుకాక ఎవరైనా నా క్లయింట్ వద్దకు వచ్చి తన చిన్నకుమారుడు అప్పులు చేశాడు తీర్చుమని ఇబ్బందులు, కలగజేసినచో నా క్లయింట్ చట్ట ప్రకారం తీసుకొను సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరు.

రాచమంటి శివాజీ,
లక్కాకుల సౌజన్య,
అడ్వకేట్స్, గుంటూరు.

పేపరు పబ్లికేషన్
మహారాజశ్రీ గజపతినగరం జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S.138/2021

Between:
గొట్టిపల్లి జగన్నాథరావు .....వాది
And :
గుత్త నందిని .....ప్రతివాది
To
ప్రతివాది ఎడ్రాసు :- గుత్త నందిని భర్త ఫణి అలియాస్, ఫణికుమార్, వయస్సు 42సం॥లు, హిందూ, బిజినెస్, సా॥ డోర్ నెంబరు 307, కొండపనేని టౌన్‌షిప్, సర్వీసురోడ్, మంగళగిరి గ్రామము, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా.

Hg. Dated :- 13-07-2023

పై నెంబరు దావాలో ప్రతివాది నోటీసు తీసుకోనకుండా తిరుగుచున్నందున శ్రీ కోర్టువారు సదరు ప్రతివాదికి ఈ పేపరు ప్రకటన ద్వారా **తే 13-07-2023 దీ**న హాజరు నిమిత్తము **ఉదయం గం॥ 10-30ని॥ల**కు ఖుద్దునగాని, వకీలుగారు ద్వారా గాని పైన తెలిపిన కోర్టులో హాజరు అయి ఏమైన ఆక్షేపణలు యున్న యెడల తెలియజేయువలసినదిగా కోరడమైనది. లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మాణించబడునని యిందు మూలకముగా ప్రతివాదికి తెలియజేయడమైనది.

"By Court Order"
శ్రీ ఉప్పలపాటి రమేష్
వాది తరుపు న్యాయవాది,
గజపతినగరం, సెల్ : 9866454030

IN THE COURT OF THE MVACT CUM II ADDL CHIEF JUDGE CITY CIVIL COURT : AT HYDERABAD
O.P.No. : 2643 of 2021

Between:
G. Prameela
... Petitioners
AND
V.Rama Rao and others
... Respondents
To,
1. P.Basheer khan S/o Meera khan
R/o. Erukalapudi, Tenali, Guntur district.

please take notice that the above petitioners has filed the case for grant of compensation for the death of G. Ravichandra, in a motor vehicle accident with vehicle bearing No. AP-27-TT-6989, which occurred on 15-10-2021, under the limits of P.S. Chirala- II-Town.

The above case is posted to 10-08-2023, at 10-30 AM for your appearance and counter. If you fail to appear before this Hon'ble Court on specified date date and time either on person or through an advocate, else the case will be decided exparte.

(BY ORDER OF THE COURT)
K. ANAND REDDY
D.VENKAT RAMANA
Counsels for the Petitioner
F.NO.212, Jamuna Towers,
Malakpet, Hyderabad-500036

అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

స్మార్ట్ మీటర్లు వద్దని ధర్నా

ప్రజాశక్తి - నకరికల్లు : రైతులకు, ప్రజలకు నష్టం చేసే విద్యుత్ సంస్కరణకు వ్యతిరేకంగా మండలంలోని చేజర్లలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సిపిఎం, రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం దర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించే చర్యలను నిలిపేయాలని డిమాండ్ చేశారు. బిల్లులేమీ ఉండబోవంటూ ఇప్పుడు మభ్యపెట్టినా భవిష్యత్‌లో అదనపు భారాలు మోపుతారని అన్నారు. గృహ విద్యుత్ వినియోగదార్లకు వివిధ ఛార్జీల పేరుతో అధికంగా బిల్లులు వేస్తున్నారని మండిపడ్డారు. భారాలను రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ధర్నాలో నాయకులు అప్పిరెడ్డి, జి.పిచ్చారావు, లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర్లు, సిహెచ్.కోటేశ్వరావు, ఎన్.వెంకటేశ్వర్లు, మీరావలి, వీరాంజనేయులు, రామాంజి నాయక్, కొండా నాయక్ పాల్గొన్నారు.

నాగేశ్వరరావును పరామర్శిస్తున్న విజయ్‌కుమార్, సూర్యప్రకాశరావు

దుగ్గి నాగేశ్వరరావుకు సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి పరామర్శ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజానాట్య మండలి పల్నాడు జిల్లా అధ్యక్షులు డి.నాగేశ్వరరావును సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ సోమవారం పరామర్శించారు. మండలంలోని రెంటపాళ్లకు చెందిన నాగేశ్వరరావు కొంతకాలంగా గుండె సంబంధిత అనారోగ్యం బారిన పడ్డారు. విజయవాడలోని ఓ ఆస్పత్రిలో స్టంట్ వేయించుకున్న ఆయన ఆస్పత్రి నుండి డిశ్చార్జి కావడంతో ఆయన్ను రెంటపాళ్లలో విజయ్‌కుమార్‌తోపాటు సత్తెనపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ పొట్టి సూర్యప్రకాశరావు, సిపిఎం మండల కార్యదర్శి పి.మహేష్ పరామర్శించారు.

పోలవరం నిర్వాసితులకు సాయం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా : పోలవరం నిర్వాసితుల పోరుకేక పాదయాత్రకు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా కమిటీ ఆర్థిక సాయం అందించింది. సోమవారం స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్‌కు నగదును యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు ఇచ్చారు. నాయకులు ఎస్‌కె.కరీముల్లా, శివపోతురాజు పాల్గొన్నారు.

భూ వివాదాలపై అధిక వినతులు

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, జెసి, డిఆర్‌ఒ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

సమస్యలను ఎదుర్కొంటున్న నిజమైన లబ్ధిదారులకు మేలు చేయడానికే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి జనం వచ్చి వివిధ అంశాలపై 357 వినతులు, ఫిర్యాదులు అందించారు. వాటిని కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, డిఆర్‌ఒ వినాయకం స్వీకరించారు. తొలుత వ్యాస మహర్షి జయంతి (గురుపౌర్ణమి)ని సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అర్జిదార్లకు రెడ్‌క్రాస్ సొసైటీ తరపున జిర్రా కోటిరెడ్డి జ్ఞాపకార్థం రొంపిచర్ల మండలం రెడ్డిపాలేనికి చెందిన వెంకట సాంబశివారెడ్డి భోజనాలు సమకూర్చారు. ఆయన్ను కలెక్టర్ సత్కరించారు.

ఆక్రమణలో దేవాలయ భూములు

బొల్లాపల్లి మండలం పమిడిపాడులోని 1200 ఏళ్ల చరిత్ర కలిగిన వీరభద్రస్వామి ఆలయానికి చెందిన ఏడెకరాలను రెవెన్యూ అధికారులతో కుమ్మక్కైన హైదరాబాద్‌కు చెందిన మండూరు రవికుమార్, కోనేరు శివాజీ ఆక్రమించారని, గ్రామానికి చెందిన మేడం బక్కిరెడ్డి ఫిర్యాదు చేశారు. పల్నాడు బ్రహ్మనాయుడు కుమారుడు బాలచంద్రుడు యుద్ధానికి వెళుతూ అప్పటికే నిర్మించిన ఆలయంలో బంగారు ఆభరణాలు దాచారంటూ, గుప్త నిధులంటూ ఆలయంలో తవ్వకాలు జరిపారని చెప్పారు. అధికారులు స్పందించి దేవాదాయశాఖ భూములను కాపాడాలని కోరారు.

స్థలాలను ఆక్రమిస్తున్నారు

2005లో సిపిఎం ఆధ్వర్యంలో చేసిన భూ పోరాటాల ఫలితంగా వెన్నపూస వాగు కాలనీ సమీపంలో ఉన్న వాగు పోరంబోకు భూమిని 40 కుటుంబాలకు 1.5 సెంట్ల చొప్పున పంపిణీ చేయించడం జరిగిందని, ఇందులో రంజాన్‌బి అనే మహిళకు చెందిన స్థలాన్ని వినుకొండ మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు విడతల దేవదాసు, వెంకటరత్నం తదితరులు అక్రమంగా కాజేయాలని చూస్తున్నారని బాధితురాలితోపాటు సిపిఎం జిల్లా నాయకులు కె.హనుమంతరెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ స్థలంతోపాటు మరో స్థలాన్నీ కాజేయాలని చూస్తున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పేదల భూములు ఆక్రమించి వారిపైనే దాడులు, కేసులు

వినుకొండ మండలం గణేశునివారిపాలెంలో పెండింగ్‌లో ఉన్న 50 ఎకరాల భూ సమస్యను పరిష్కరించాలని పలువురు సిపిఐ (ఎంఎల్) లిబరేషన్,

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విన్నవించారు. నాయకులు టి.ఆంజనేయులు మాట్లాడుతూ 2005లో 50 ఎకరాలకు పట్టాలు, పాసు పుస్తకాలిచ్చినా పొజిషన్ చూపలేదని, దీంతో గోదావరి జిల్లాకు చెందిన నాగేశ్వరావు అనే వ్యక్తి అది తన పొలమంటూ స్థానికులపై దాడులు, బెదిరింపులకు దిగుతున్నారని చెప్పారు. అక్రమ కేసులు కూడా పెట్టిస్తున్నాడన్నారు. శ్మశాన స్థలాలు సైతం ఆక్రమించాడని, రెవిన్యూ అధికారుల సహాయ సహకారాలతోనే ఇవన్నీ జరుగుతున్నాయని చెప్పారు. దీనిపై విచారణ చేయాలని కోరారు. వినుకొండ పట్టణంలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ జీఓ నెం 1, 42, 253 నిబంధనలు మీరి పాఠశాలలు నడుపు తున్నారని, అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు.

పొలాలకు వెళ్లే డొంక రోడ్డును ధ్వంసం చేశారు

పొలాలలకు ట్రాక్టర్ లు, ఎద్దుల బండి, అరక తదితర వ్యవసాయ యంత్రాలు సులువుగా వెళ్లేందుకు ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన డొంక రోడ్డును ధ్వంసం చేయడంతో పాటు స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని అచ్చంపేట మండలం వేల్పూరుకు చెందిన రైతులు పాలెపు శ్రీనివాసరావు, పచ్చ వెంకటేశ్వర్లు కోరారు. ఈమేరకు తోటి రైతుల నుండి సంతకాలు సేకరించిన వినతిపత్రాన్ని ఇచ్చారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగుకు సమయం ఆసన్నమైన నేపథ్యంలో త్వరితగతిన సమస్య పరిష్కరించాలని, డొంక రోడ్డును పున:నిర్మించాలని కోరారు.

నా భూమిలో రియలెస్టేట్ నిర్మాణాలు

తమ పొలం ప్రక్కనే రియల్ ఎస్టేట్ వ్యాపారులు వేసిన వెంచర్ నిర్మాణ పనుల్లో భాగంగా పంట కాల్వతో తన పొలం వైపు జరిగి కొంత భూమి ఆక్రమించారని, ప్రశ్నిస్తే సర్వే చేయించుకో వాలంటున్నారని రావిపాడుకు చెందిన తాడపనేని ప్రసాద్ ఫిర్యాదు చేశారు. సర్వే చేయించే వరకైనా పనులు ఆపాలని కోరుతున్నా వినకుండా తన పొలంలో డ్రైన్‌లు, సిమెంట్ రోడ్డు వేస్తున్నారని వాపోయారు.

నాలుగేళ్లుగా పెన్షన్ నిలిపేశారు

భర్తతో విభేదించి 20 ఏళ్లుగా ఒంటరి ఉంటున్న తనకు 2012 నుండి పెన్షన్ వస్తోందని, 2019లో కొత్త ప్రభుత్వం వచ్చాక 2 నెలలు పెన్షన్ ఇచ్చి నిలిపేశారని బెల్లంకొండ మండల కేంద్రానికి చెందిన వల్లూరు కామేశ్వరమ్మ ఫిర్యాదు చేశారు. దీనిపై తాను అధికారుల చుట్టూ తిరిగినా కారణం చెప్పడం లేదని, వృద్ధాప్యంలోనూ కూలి పనులు చేసుకుని బతుకుతున్న తనకు అన్యాయం చేయొద్దని కోరారు.

పాఠశాల వద్ద స్పీడ్ బ్రేకర్‌ను వేయించండి

నరసరావుపేట మండల పరిధిలోని రావిపాడు గ్రామ ఇందిరా ప్రియదర్శిని కాలనీ వద్ద ప్రభుత్వ పాఠశాల ఎదురుగా నకరికల్లు రోడ్డును మరమ్మతులు చేసే క్రమంలో స్పీడ్ బ్రేకర్‌ను విస్మరించడంతో వాహనాల వేగానికి పరిమితుల్లేక తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీకి చెందిన సిహెచ్.సాంబయ్య ఫిర్యాదు చేశారు. విద్యార్థులు, చిన్నారులను దృష్టిలో పెట్టుకుని అయినా పాఠశాల ప్రాంతంలో వాహనాల వేగ నియంత్రణకు స్పీడ్ బ్రేకర్ వేయించాలని కోరారు.

డంపింగ్ యార్డును మరో చోటకు మార్చండి

గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న డంపింగ్ యార్డును ప్రజారోగ్యం దృష్ట్యా మరో చోటకు తరలించాలని సిపిఐ ఆధ్వర్యంలో విన్నవించారు. జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు, పట్టణ కార్యదర్శి వి.వెంకట్ మాట్లాడుతూ డంపింగ్ యార్డుకు సమీపంలో టిడ్కో గృహాలున్నాయని, నిత్యం వాహనాల రాకపోకలతో గుంటూరు కర్నూలు రహదారి రద్దీగా ఉంటుందని చెప్పారు. డంపింగ్ యార్డ్ నుండి వచ్చే పొగ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని చెప్పారు.

అడ్డగోలుగా అక్రమ మైనింగ్

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అక్రమ మైనింగ్‌కు అడ్డే లేకుండా పోయిందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. ఈటి రోడ్డు, కోటప్పకొండ, గురవాయిపాలెం, ములకలూరు గ్రామాల్లో అక్రమ మైనింగ్ చేస్తున్నారని చెప్పారు. దీనిపై విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఎమ్మెల్యే అనుచరులు గోనేపూడి వద్ద మట్టిని అక్రమంగా తవ్వుకుంటూ విజిలెన్స్ అధికారులకు పట్టుబడినా వదిలేశారని చెప్పారు. పట్టణంలో అధ్వాన పారిశుధ్యంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని చెప్పారు. కేన్సర్‌తో బాధపడుతున్న జొన్నలగడ్డ ఎస్సీ కాలనీకి చెందిన యువతిని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలన్నారు. వైసిపి అభిమానిగా మారితేనే పింఛను ఇస్తామంటూ వృద్ధుణ్ణి ఇబ్బంది పెడుతున్న వాలంటీర్లు, కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలన్నారు.

పాఠశాల స్థలాన్ని ఆక్రమించారు

స్థలానికి నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమించిన పెత్తందారులపై చర్యలు తీసుకోవాలని బెల్లంకొండ మండలం కొత్తపాలెం ఎస్సీలు కోరారు. ఈ మేరకు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. కెవిపిఎస్ పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు మాట్లాడుతూ కొత్తపాలెం ఎస్సీ కాలనీలో పాఠశాల ఏర్పాటుకు 1985లో స్థానికులు 12 సెంట్ల స్థలాన్ని వితరణిచ్చారని చెప్పారు. ఇందులో కొంత భాగంలో పాఠశాల భవనాన్ని నిర్మించగా మిగతా స్థలాన్ని చిన్నారులు ఆడుకునేందుకు వినియోగించుకుంటున్నారని తెలిపారు. అయితే ఈ స్థలాన్ని పెత్తందార్లు తొలుత గేదెలను కట్టివేయడానికి, దిప్పలు వేయడానికి వాడుకుని ఇప్పుడు ఏకంగా నకిలీ పత్రాలు సృష్టించారని తెలిపారు. గతేడాది ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల ద్వారా రూ.3.11 లక్షల లోన్లు తీసుకుని నిర్మాణాలు చేపట్టారని వివరించారు. స్థలాన్ని కబ్జా నుండి విడిపించాలని, పాఠశాలకు అప్పగించాలని కోరారు.

అర్జీలు పునరావృతం కాకుండా చర్యలు

కలెక్టర్ స్పందనకు 170 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చి, స్పందన కార్యక్రమంలో అందించిన అర్జీలను నిర్ణీత గడువులోగా రీఓపెన్ కాకుండా వుండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి సూచించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణశర్మ, డిఆర్ఓ కె.చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకటశివరామిరెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు లలితా, మోవిడి వాణి, సాయిశ్రీ జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 170 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జగనన్న సురక్ష కార్యక్రమంలో వాలంటీర్లు ఇంటింటి సర్వే వంద శాతం నిర్వహించేలా నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల స్థాయి ప్రత్యేక అధికారులు, టాస్క్ ఫోర్స్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. సర్వీసు రిక్వెస్ట్ రిజిస్ట్రేషన్లు వంద శాతం పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం అయినందున కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డుల టార్గెట్ జూలై 31 నాటికి పూర్తి చేయాలన్నారు. కౌలు రైతులకు

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

బ్యాంకర్లు విరివిగా రుణాలు మంజూరు చేసేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ళ నిర్మాణాలు, ఓటర్ల జాబితాలో తప్పుల సవరణకు ఇంటింటి సర్వే, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ, డ్వామా పీడీలు హరిహరనాథ్, యుగంధర్ కుమార్, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూధనరావు, పంచాయతీ రాజ్ ఎస్.ఇ గుర్రం బ్రహ్మయ్య, జిల్లా పంచాయితీ అధికారి కేశవ రెడ్డి, ఐసీడీఎస్ పీడీ మనోరంజని, డిఈఓ శైలజ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ శ్రావణ్ బాబు పాల్గొన్నారు.

విభాగాధిపతులే నేరుగా పరిశీలించాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదులను విభాగాధిపతులే నేరుగా పరిశీలించి పరిష్కరించాలని, ఏ ఒక్క ఫిర్యాదు పునరావతం కాకుండా శాశ్వత ప్రాతిపదికన పరిష్కారానికి కషి చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో స్పందన నిర్వహించారు. కమిషనర్ తొలుత జగనన్నకు చెబుదాం, స్పందన పోర్టల్, ఈ.ఆర్.పి, వాట్స్ అప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదుల పై అధికారులతో, సంబందిత సిబ్బందితో సమీక్షించి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పట్టణ ప్రణాళిక విభాగం 8, ఇంజినీరింగ్ విభాగం 9, రెవెన్యూ విభాగం 4, ప్రజారోగ్య విభాగం 1, ఉపా సెల్ 4, అకౌంట్స్ విభాగం సంబంధించి 8, పరిపాలన విభాగానికి సంబందించి 1 ఫిర్యాదు మొత్తం 35 ఫిర్యాదులు అందాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్ రవీంధ్ర, ఎస్.ఈ. భాస్కర్, డిప్యూటీ సిటి ప్లానర్ కోటయ్య, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, బయాలజిస్ట్ మధుసూదన్, మేనేజర్ శివన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

జనన ధ్రువపత్రం లేక చదువులకు దూరం

జనన ధ్రువపత్రం లేకపోవటంతో చిత్తుకాగితాలు ఏరుకునే వారి పిల్లలు వందల మంది చదువులకు, సంక్షేమ పథకాలకు దూరం అవుతున్నారని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ప్రతినిధి చిన్నప్ప అన్నారు. సోమవారం ఆయా పిల్లలకు జనన ధృవపత్రం, ఆధార్, ఇతర గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరుతూ డిబిఆర్‌సి ఆధ్వర్యంలో పిల్లలతో కలిసి స్పందనలో అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా చిన్నప్ప మాట్లాడుతూ జిల్లాలో వడ్డేశ్వరం, గుండుటరు డంపింగ్‌యార్డు, కొలకలూరు, తాడేపల్లి, మంగళగిరి తదితర ప్రాంతాల్లో వందల మంది చిత్తుకాగితాలు ఏరుకునే వారి పిల్లలకు జనన ధృవీకరణ పత్రాలు లేవన్నారు. పాఠశాలల్లో చేరటానికి, ఆధార్‌కు జనన ధృవీకరణ పత్రం తప్పని సరి అని, దీంతో వారిని పాఠశాలల్లో కూడా చేర్చుకోవట్లేదని తెలిపారు. కొంత మందికి రేషన్ కార్డులు లేవన్నారు. కావున జిల్లా అధికారులు స్పందించి గుర్తింపు కార్డులు జారీ చేసి, చదువులు, సంక్షేమ పథకాలు అందించాలని కోరారు.

సబ్సిడీ టమాటాలు మంగళగిరిలో విక్రయించరా..

ప్రజాశక్తి-మంగళగిరి

రూ.50కే కేజీ టమాటాలను రైతుబజార్ల ద్వారా అందిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ మంగళగిరి రైతు బజార్‌కు సబ్సిడీ టమాటాలు నేటికీ చేరలేదు. దీంతో రూ.90లకు టమాటాలు అమ్ముతున్నారు. బయట మార్కెట్లో రూ.120 వరకు అమ్ముతున్నారు. రైతుబజార్ అధికారిని వివరణ కోరగా గుంటూరు, తెనాలి రైతుబజార్లలో సబ్సిడీ టమాటాలు వున్నాయని మంగళగిరికి రాలేదని చెప్పారు. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం వినియోగదారులకు ఇబ్బందిగా మారింది.

రేషన్ సక్రమంగా అందించాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని అమరారెడ్డినగర్, యానాదుల కాలనీ, కొత్త కాలనీలో జూన్ నెలకు సంబంధించి 600 మంది కార్డుదారులకు అందించాల్సిన రేషన్ బియ్యం వెంటనే అందించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆ మేరకు కృష్ణుని గుడి వద్ద గల 4, 5 వార్డుల సచివాలయ అడ్మిన్‌కు వినతిపత్ర అందజేశారు. ఈ విషయంపై వలంటీర్లు, సచివాలయ సిబ్బంది వెంటనే స్పందించాలని కోరారు. దీనిపై స్పందించిన అడ్మిన్ సమస్యను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తామని, పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు డివి భాస్కరరెడ్డి, గోపాల్‌రెడ్డి, దశరధరామిరెడ్డి, సోలా ముత్యాల రావు, ఎల్.ఆచారి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమ్మెలోకి..

ప్రజాశక్తి - మేడికొండూరు

కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో నికో ఆగ్రో కంపెనీ యాజమాన్యం మొండి వైఖరి వహిస్తుందని, ఏ క్షణంలోనైనా సమ్మెలోకి వెళ్లడానికి కార్మికులు సిద్ధంగా ఉండాలని సిఐటియు గుంటూరు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం మండలంలోని పేరేచర్లలో కార్మికులతో విస్తృత సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పరిశ్రమ ఏదైనా కార్మిక చట్టాలు అమలపరుస్తూ కార్మికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అన్నారు. దశాబ్దాల కాలం నుండి పనిచేస్తున్నప్పటికీ కొన్ని కంపెనీలు కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యాయని అన్నారు. అందులో భాగంగా పేరేచర్ల నీకో ఆగ్రో ఆయిల్ కంపెనీలో కార్మికుల కనీస సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం విఫలమైందని అన్నారు. న్యాయబద్ధంగా కార్మికులకు అందవలసిన సౌకర్యాలు, జీతాల పెంపు విషయంలో కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యపు ధోరణిలో ఉండటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కార్మికుల హక్కుల సాధన కోసం సమ్మెకు కార్మికులందరూ సన్నద్ధంగా ఉండాలని కార్యచరణ రూపొందించారు. కార్యక్రమంలో మండల సిపిఎం పార్టీ నాయకులు బొట్ల రామకృష్ణ, సిఐటియు మండల కార్యదర్శి ఎస్ఎం భాష, నీకో ఆగ్రో ఆయిల్ కంపెనీ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు మీరా సాహెబ్, వి సాంబశివరావు, కే సీతాపతిరావు, ఎం రవిచంద్ర రెడ్డి, పి చలపతి, ఆర్ మహేష్, ఎస్ సాంబయ్య, డి సుబ్బారెడ్డి, పి సుధాకర్ రెడ్డి, షేక్ జానీ భాష తదితరులు పాల్గొన్నారు.

తెనాలి నుండి పోటీ

జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - తెనాలి

ప్రజా సమస్యలపై ఏమాత్రం స్పందించని ప్రభుత్వం స్పందన కార్యక్రమం ఎవరికోసం నిర్వహిస్తోందంటూ జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ ప్రశ్నించారు. జగనన్న సురక్షలో లక్షలాది దరఖాస్తులు పరిష్కరిస్తున్నామని చెబుతున్న అధికారులు పరోక్షంగా వారి వైఫల్యాన్ని ఒప్పుకున్నట్లేనని స్పష్టం చేశారు. తెనాలి కొత్తపేట లోని మనోహర్ నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వైసిపి పై మనోహర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. నాలుగేళ్ల వైసిపి పాలనలో రకరకాల పేర్లతో పేదలను ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. సంక్షేమం ముసుగులో అనితర సాధ్యమైన దోపిడీలకు తెరతీసిందని ఆరోపించారు. జగనన్నకు చెబుదాం అంటూ ఆర్భాటంగా ప్రారంభించిన కార్యక్రమంలో ప్రజలు ఏ సమస్యపై మొత్తుకున్న ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జగనన్న సురక్ష పై శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేపట్టిన వారాహి యాత్ర ప్రజాదరణ పొందింద న్నారు. అది ఓర్చుకోలేని వైసీపీ నేతలు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారన్నారు. తాను తెనాలి నుంచి పోటీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. పొత్తులు విషయం పార్టీ పెద్దలు నిర్ణయం తీసుకుంటారన్నారు. సమావేశం లో నాయకులు టి వెంకట రమణ రావు జాకీర్ అహ్మద్, హరిదాసు గౌరీ శంకర్, బి రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్ విస్తరణపై తాత్సారం

దీక్షలకు మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు సంఘీభావం

ప్రజాశక్తి-గుంటూరు

దీక్షల్లో మాట్లాడుతున్న పుల్లారావు దీక్షల్లో మాట్లాడుతున్న పుల్లారావు

నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చి, టెండరు, డిజైన్ పూర్తి అయిన గుంటూరు ఛానల్ విస్తరణపై ప్రభుత్వం తాత్సారం చేయటం తగదని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకూ పొడిగించాలని కలెక్టరేట్ ఎదుట నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షలకు సోమవారం ప్రత్తిపాటి పుల్లారావు మద్దతు పలికారు. దీక్షల్లో పాల్గొన్న వారికి పుల్లారావు పూలమాలలు వేసి 6వ రోజు దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో టిడిపి ప్రభుత్వం రూ.274 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారని, ఈలోగా ఎన్నికలు వచ్చాయన్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ ద్వారా సమీక్షించినా గుంటూరు చానల్ విస్తరణకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. చంద్రబాబు ప్రభుత్వం జిఓ ఇచ్చిందనే అమలు చేయలేదన్నారు. జిఓ ఇచ్చి డిజైన్ పూర్తి చేసిన ప్రాజెక్ట్‌ను ఎందుకు ముందుకు తీసుకెళ్లట్లేదని, రైతుల కంటే ముఖ్యమైనది ఏముంటుందని ప్రశ్నించారు. ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, పర్చూరు మండలాల్లో 50 గ్రామాలకు తాగునీరు, 50వేల ఎకరాలకు సాగునీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. అటువంటి ప్రాజెక్ట్ నాలుగేళ్లలో ఒక్క అడుగు ముందుకు పడలేదన్నారు. రూ.274 కోట్లలో రూ.113 కోట్లు భూసేకరణకు కోసం అవసరమన్నారు. కనీసం ఈ ప్రభుత్వ హయాంలో భూసేకరణకూ నిధులు విడుదల చేయలేదన్నారు. కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్ తదితరులు ప్రసంగించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి గుంటూరు ఛానల్ విస్తరణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో రాబోయే ఎన్నికల్లో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, గుంటూరు ఛానల్ విస్తరణకు అధిక ప్రాధాన్యత ఇచ్చి చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా ప్రపంచ మెకానిక్స్ డే

ప్రజాశక్తి పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణంలో మా బైక్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సోమవారం ప్రపంచ మెకానిక్స్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎస్పిపి రోడ్డు నుంచి ఐలాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రపంచ మెకానిక్స్ డే ప్రాధాన్యతను ర్యాలీలో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్స్ అధ్యక్షుడు షేక్ కాలేషా సెక్రటరీ సుభాని ట్రెజరర్ సుభాని పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో

ప్రజాశక్తి తెనాలి:స్థానిక చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సోమవారం ప్రపంచ మెకానిక్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి కె బాబు ప్రసాద్ మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా ఉండాలని, ఐక్య పోరాటాల ద్వారానే హక్కులను సాధించు కోవాలన్నారు. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్లుగా మార్చేసిందని, కార్మిక ఐక్యతను దెబ్బతీసే కుట్రగా అభివర్ణిం చారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ హుస్సేన్ వలి, వివిధ విభాగాలలో పనిచేస్తున్న మెకానిక్స్ పాల్గొన్నారు

ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడీ భవనాల ప్రారంభం

ప్రజాశక్తి-బెల్లంకొండ

బెల్లంకొండ మండలంలో అభివృద్ధికి దూరంగా ఉన్న రామాంజనేయపురం వాసుల దశాబ్దాల కల నెరవేరింది. నూతనంగా నిర్మించిన ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడీ భవనాలను అటవీ శాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పారంభించారు. ఆదివారం ్రరామాంజనేయ పురంలో ఎమ్మెల్యే పర్య టించారు. రూ. 35 లక్షలతో ప్రాథమిక పాఠశాల, రూ. 15 లక్షలతో అంగన్ వాడీ భవనానికి గత ఏడాది ఆగస్టులో ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం రామాంజ నేయపురం అభివృద్ధికి కట్టుబడి ఉన్నాన్నారు. అటవీ ప్రాంతం కావడంతో పాఠ శాలలకు మిగిలిన సౌకర్యాలకు అటవీశాఖ అను మతులు రావడం చాలా కష్టమైందన్నారు. కానీ పల్నాడు జిల్లా అటవీ శాఖాధికారి రామచంద్రరావు సహకారంతో అన్ని అనుమతులు వచ్చాయన్నారు. గతంలో చిన్నారులు బడికి వెళ్లాలంటే 6 కిలో మీటర్లు నడ వాల్సి వచ్చేదన్నారు. దీనివల్ల ఎంతోమంది చదువుకు దూరమై భవిష్యత్తును కోల్పోయారన్నారు. ఇకపై అలాంటి పరిస్థితి ఉండబోదన్నారు. రామాంజనేయపురం అభివృద్ధికి రోడ్ల నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరయ్యాయని, ఎస్టీ సబ్ ప్లాన్ కింద రూ. 10 లక్షల నిధులు వస్తాయన్నారు. ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు జలజీవన్ మిషన్ ద్వారా రూ.71 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. రామాంజనేయపురం వాసులకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు, వ్యవసాయ బోర్లు వేసుకునేందుకు అటవీ శాఖ అనుమతులు ఇచ్చి సహకరించాలని కోరారు. గ్రామస్థులు కూడా అడ వులను ధ్వంసం చేయకుండా అధికారులకు సహకరిం చాలని సూచించారు. అప్పుడే గ్రామాభివృద్ధి మరింత సులభమవుతుందని చెప్పారు.

వ్యవసాయ భూమి హక్కు పట్టాల పంపిణీ

ప్రజాశక్తి-అచ్చంపేట

ఎన్నో ఏళ్లుగా రైతులను కష్టపెడుతున్న చుక్కల భూముల సమస్యకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిష్కారం చూపించారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు సోమ వారం. అచ్చంపేటలో చిగురుపాడు రెవిన్యూ పరిధిలోని చుక్కల భూముల సమస్య పరి ష్కారం మైన 5 ఎకరాల భూమికి సంబంధించిన భూమి హక్కు పట్టాలు రైతులకు అందజేశారు. మొత్తం 9 మంది రైతులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెవెన్యూ కార్యాలయాలు, కోర్టుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, ఒక్క పైసా ఖర్చు కాకుండా దశాబ్దాల సమస్యకు పరిష్కారం చూపించిన ముఖ్యమంత్రి కి రైతుల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నా మన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలోని పెట్లూరువారి పాలెం గ్రామంలో రూ.55 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాం బాబు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ గజ్జల బ్రహ్మ రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు కెవిపి రామ చంద్రరావు కుటుంబం సభ్యులు హాజరయ్యారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మాజీ రాజ్యసభ సభ్యులు కవిపి రామ చంద్రరావు రూ 25 లక్షలు ప్రకటించగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి కృషి, సహాయ సహకారాలతో ప్రభుత్వ తరపున రూ. 30 లక్షలు మొత్తం రూ 55 లక్షల ఈ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మూరబోయిన శ్రీనివాసరావు, జడ్పిటిసి పి.చిట్టిబాబు, గ్రామ సర్పించ్ మేకల మురళి మోహన్, వైసిపి నాయకులు కార్యకర్తలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంఇఒ-1 నాగరత్నం

ప్రజాశక్తి - యడ్లపాడు

యడ్లపాడు ఎంఇఒ-1గా ఎంవి నాగరత్నం సోమ వారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లాలోని వేమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలిగా పని చేస్తున్న ఆమె ఆదివారం జరిగిన బదీలీల్లో భాగంగా పదోన్నతిపై యడ్లపాడుకు వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ ఇన్‌చార్జి ఎంఇఒగా విధులు నిర్వహిస్తున్న ఎంఇఒ తన సొంత మండలానికి పరిమితమయ్యారు. బాధ్యతలు చేపట్టిన నాగరత్నంకు ఉపాధ్యాయ సంఘనాయకులు, ఉపా ధ్యాయులు అభినందనలు తెలిపారు.

నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - వినుకొండ

రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ ప్రమాణ స్వీకార కార్యక్రమం పల్నాడు రోడ్ లోని బృందావన హోటల్‌లో సోమవారం జరిగింది. పట్టణానికి చెందిన రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గా చిరుమామిళ్ల కోటేశ్వరరావు,ను సెక్రెటరీగా గుత్తా,గురునాథం, ట్రెజరర్ గా నాయబ్. రసూల్, ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిస్టిక్ గవర్నర్ బూసి రెడ్డి శంకర్ రెడ్డి, పాల్గొని ఆయన చేతుల మీదగా నూతన సభ్యులు పరిచయం, ప్రమాణం చేయిం చారు. గవర్నర్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలగా రోటరీ క్లబ్ వినుకొండలో చేస్తున్న కార్యక్రమాలను కొని ఆడారు. అనంతరం గత సంవత్సరం అధ్యక్ష కార్యదర్శులకు సభ్యులకు ఘనంగా సత్కారాలు చేశారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ గవర్నర్ ఆలా. శ్రీనివాసరావు, గన్నమనేని. నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌లో అంశాలపై 17న ప్రజావేదిక

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

సోషల్ ఆడిట్ పై సమీక్షిస్తున్న ఎండిఒ కె.మ్యాథ్యూబాబు

రొంపిచర్ల మండల పరిషత్ కార్యాలయంలో సోమ వారం ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం జరిగింది. ఈ సమా వేశంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి 15వ విడత సోషల్ ఆడిట్ పై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎండిఒ కె.మ్యాథ్యూబాబు మాట్లాడుతూ మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పను లపై 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సోషల్ ఆడిట్ వివరాలు కార్యాలయంలో అందజేయా లని ఆదేశించారు. మండలంలో అన్ని గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం ఈ పథకం పనులపై ఆడిట్ నిర్వహించాలని, సోషల్ ఆడిట్ లో వచ్చిన అంశాలపై నివేదిక తయారు చేయాలని అన్నారు. మండలంలో అన్ని గ్రామాల్లో జరుగనున్న సోషల్ ఆడిట్ లో వచ్చిన అంశాలపై ఈ నెల 17న ప్రజావేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్య క్రమంలో ఎన్ ఆర్ ఇజియస్ ఎపిఒ కోట ప్రసాద్, ఎస్ ఆర్ పి టి. వెంకటేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రీ సర్వే పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-పెదకూరపాడు

రీ సర్వే పనులు వేగవంతం చేయాలని సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ ఆఫీసర్ రాజకుమారి కోరారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ క్షమారాణి మండల అభివృద్ధి అధికారి నరసింహారావు, ఇతర అధికారు లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టిన తొలి విడత రీసర్వే పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. గ్రామ సర్వేయర్లు, ఇతర సిబ్బంది సక్ర మంగా పనిచేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన

ప్రజాశక్తి-అమరావతి

అందిస్తున్న సంక్షేమ పథకాల విషయంలో లబ్ది దారుల సమస్యలన్నీ తీర్చాలని ఎమ్మెల్యే నంబూరు శంకర రావు అన్నారు. అమరావతి మండలం నరుకుళ్లపాడు గ్రామంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన క్యాంప్ లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. క్యాంప్ లో ధ్రువీకరణ పత్రాలు, డాక్యుమెంట్లు ఆధార్ తో ఇబ్బందులు ఇలా పలు రకాల సేవల్లో ఇబ్బందులను తెలుసుకొని అధికారులు పరిష్కరించారు. నరుకుళ్ల పాడులో మొత్తం 204 సమస్యలను గుర్తించారు. వాటిని నెలరోజుల్లో పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి సమస్యలున్నా సచి వాలయంలో పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచిం చారు. కార్యక్రమంలో తహశీల్దార్ విజయ శ్రీ, ఎంపీడీవో మాధురి, ఎంపీపీ మేకల హనుమంతరావు, జడ్పిటిసి ఈడుపుగంటి కరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్సి పరామర్శ

ప్రజాశక్తి-నాదెండ్ల

మండలంలోని చిరు మామిళ్లలో మృతి చెందిన కత్తి మార్తమ్మ కుటుంబాన్ని ఎమ్మెల్సి మర్రి రాజశేఖర్ సోమవారం పరామర్శిం చారు. గ్రామంలోని వారి నివాసం వద్ద మార్తమ్మ భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఎమ్మెల్సి వెంట పాస్టర్ పౌల్, సిస్టర్ రూతు,ఎం.ఆనంద్ ఉన్నారు.

కేసీపీలో ఎలక్ట్రికల్ భద్రత వారోత్సవాలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న కెసిపి ఫ్యాక్టరీ జిఎం వి. వెంకటరమణ తదితరులు

మాచర్ల పట్టణం స్థానిక కెసిపి ఫ్యాక్టరీ నందు అంతర్జాతీయ ఎలక్ట్రికల్ భద్రత వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వారోత్సవాలలో భాగంగా సోమవారం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కెసిపి ఫ్యాక్టరీ జిఎం వి. వెంకటరమణ, హెచ్ ఆర్ మేనేజర్ లు జి. శ్రీనివాసరావు, ఎం శ్రీనివాసరావు, ఎలక్ట్రికల్ డీజీఎం కె.రామకోటేశ్వరరావు పాల్గొని ఫ్యాక్టరీ వర్కర్లను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి కార్మికుడు జాగ్రత్తగా వ్యవహరించి, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త పడాలని సూచించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీసర్ బి.వెంకటేశ్వరరావు సిఐటియు నాయకులు బి. మహేష్, వెంకటరత్నం, సురేష్, వెంకట్రావు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-అమరావతి

అమరావతి మండల పరిధి గ్రామాల్లో మంగళవారం ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు విధ్యుత్ సర ఫరా నిలిపి వేయబడుతుందని విద్యుత్ అధికారి అశోక్ కుమార్ సోమవారం తెలిపారు. విద్యుత్ సరఫరాలో జరిగే అసౌకర్యానికి వినియోగదారులు సహ కరించాలని కోరారు.

టిఫిన్ బండ్లు, తోపుడు బండ్లు పంపిణీ

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలో కాయ కష్టం చేస్తూ, దినసరి వేతనాలక పని చేసుకుంటూ నివసిస్తున్న బడుగు, బలహీనవర్గాల వారికి భాష్యం ప్రవీణ్ నారా ఫౌం డేషన్ ద్వారా 6 టిఫిన్ బండ్లు, 30 తోపుడు బం డ్లను చిరు వ్యాపారస్తులకు సోమ వారం అంద జేశారు. స్థానిక కృష్ణమహల్ సెంటర్ లోని నారా ఫౌండేషన్ కార్యాలయము నందు ఉద యం ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత మాజీ కార్యదర్శి డి.సాంబశివరావు, ఈపూరివారి పాలెం టిడిపి నాయకులు కె. మల్లికార్జున్, తెలుగు యువత కార్యదర్శి షేక్ అబ్దుల్ మజీద్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు బాగుచేయాలని 5న పాదయాత్ర

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక కుమ్మరిపాలెం, తిమ్మాయిపాలెం, భారతపురం, పానకాల పాలెం, దొండపాడు, నడిగడ్డ ఈ గ్రామాలకు వెళ్లే రహదారులు గత కొన్ని సంవత్సరాలుగా అధ్వానంగా తయారై ఈ ప్రాంతంలో ఆటోలు బస్సుల్లో ప్రయాణాలు చేయడానికి ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్లను బాగు చేయాలని సిపిఐ వినుకొండ మండల కార్యదర్శి భూదాల సాగర్ బాబు తెలియజేశారు. ఈ నెల 5వ తేదీన నడిగడ్డ నుండి వినుకొండ వరకు నిర్వహించే పాదయాత్రలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ పాల్గొంటారని చెప్పారు.

నిరుపయోగంగా డంపింగ్ యార్డులు!

ఎంటీఎంసీ పరిధిలోని మెల్లెంపూడిలో, ఫిరంగిపురం మండలంలోని బేతపూడిలో ఇబ్బందిపడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటీఎంసీ పరిధిలోని మెల్లెంపూడి పిడబ్ల్యుడి కాలువ కట్ట వద్ద ఉన్న డంపింగ్ యార్డు నిరుప యోగంగా మారింది. గ్రామంలో వ్యర్థాలు, చెత్తా చెదారం సేకరించి, పారిశుద్ధ్య కార్మికులు రోడ్డుపైనే వదిలేస్తున్నారు. రోడ్డు వెంబడి చెత్త తగలబెట్టడం వలన విపరీతంగా పొగ రోడ్డుపైకి వచ్చి చేరుతోంది. దీంతో అటుగా ప్రయాణం సాగించే వాహన దారులు దుర్గంధం తోను, పొగతోను ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఒకవైపున రోడ్డు ఇరుకుగా (వెడల్పు తక్కువగా) ఉండ డంతో పొగంత రోడ్డును కప్పి వేసే పరిస్థితి. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలు ఒక దానికి ఒకటి ఢీ కొని ప్రమాదాలు జరుగుతున్నాయి. గత ప్రభుత్వం హయాంలో నిర్మించిన డంపింగ్ యార్డులు నిరుప యోగంగానే మారాయి. ఆ రోడ్డు వైపు నుండి కెఎల్ యూనివర్సిటీకి వచ్చే విద్యార్థులు,కార్మికులు, గ్రామ ప్రజలు,వ్యవసాయ కార్మికులు ఈ పొగ కారణంగా నానా యాతన పడుతున్నారు. తక్షణమే. మంగళగిరి -తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు రోడ్డు వెంబడి ఉన్న చెత్తను తొలగించి, డంపింగ్ యార్డును ఉపయోగిస్తే ఎవరికి ఇబ్బంది కలగకుండా ఉంటుంది. అదేవిధంగా వాహనదారుల ప్రయాణానికి ఆటంకం కలగకుండా, ప్రమాదాలు జరగకుండా ఉంటాయని స్థానికులు అంటున్నారు.

వాగులో పారే నీటికి అడ్డంగా చెత్త

ప్రజాశక్తి-ఫిరంగిపురం

మండలంలోని బేతపూడిలో ఇంటింటికి తిరిగి సేకరించిన తడి,పొడి చెత్తను పారిశుద్ధ్య కార్మి కులు గ్రామానికి ముందు డంపింగ్ యార్డ్‌కు ఎదురుగా వెంకటేశ్వర స్వామి గుడికి పక్కన ఉన్న వాగులో పారే నీటికి అడ్డంగా పడేస్తున్నారు. దీంతో, దుర్గంధపూరితమైన వాసన ,క్రిమికీటకాలు, దోమలు చేరుతున్నాయి. సమీపంలోనే

మెల్లెంపూడిలో రోడ్డుపైనే తగులబెడుతున్న చెత్త

ఇళ్లు ఉండటంతో దోమల బారిన పడుతున్న వారు విష జ్వరాలతో ఆస్పత్రుల పాలవుతున్నారు. చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బేతపూడిలోని వాగులో పడేసిన చెత్త

బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి

ప్రజాశక్తి - పెదనందిపాడు

పెదనందిపాడు లో స్కూల్ బస్సులను బ్రేక్ ఇన్‌స్పెక్టర్ కె.మల్లే శ్వరి ఆధ్వర్యంలో సోమ వారం తనిఖీలు నిర్వహించారు, ఆమె మాట్లాడుతూ స్కూల్ బస్సు లకు ఫిట్నెస్ సర్టిఫికెట్ తప్పని సరిగా ఉండాలని, బస్సులలో ఫస్ట్ ఎయిడ్ కిట్, మంచినీరు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని సూచించారు, డ్రైవర్ తో పాటు సహాయకుడు బస్సులో ఉండాలని పేర్కొన్నారు, వేగంగా బస్సులను నడపకూడదని, విద్యార్థుల పట్ల తగిన జాగ్రత్తలు వహించాలన్నారు.



పెదనందిపాడులో 'అమ్మ ఒడి'

ప్రజాశక్తి-పెదనందిపాడు

జగనన్న అమ్మఒడి 2022 -2023 విద్యా సం వత్సరానికి సంబంధించి విద్యార్థుల తల్లుల ఖాతాలలో అకౌంట్లో డబ్బులు జమ చేసే కార్యక్రమాన్ని సోమవారం పెదనందిపాడు మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత ప్రారం భించారు, ఆమె మాట్లాడుతూ పెదనందిపాడులో 2693 విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నాలుగు కోట్ల మూడు లక్షల 95 వేల రూపాయలు జమ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ కాసిం పీరా, ఏబీ పాలెం సొసైటీ చైర్పర్సన్ కూరేటి భూషయ్య, ఎంఈఓ డి బాల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పసుపు కాటా వేస్తున్న హమాలీలు

మద్దతు ధరకు చేరువలో పసుపు ధరలు

ప్రజాశక్తి-దుగ్గిరాల

స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యార్డులో సోమవారం పసుపు ధరలు గరిష్టంగా క్వింటాక్ రూ.6400 పలికాయి. 2023 సంవత్సరంలో ఇది అత్యధిక ధర కావడం విశేషం. దీంతో రైతులు అమ్మకాలు జరుపుతున్నారు. సోమవారం పసుపు కొమ్ములు 1306 క్వింటాళ్ళు, దుంపలు 693 క్వింటాళ్ల మొత్తం 1999 క్వింటాళ్ల అమ్మకాలు జరిపారు. ఇంకా యార్డులో దాదాపు పది వేల క్వింటాళ్ల పసుపు అమ్మకానికి ఉంది. ఏప్రిల్ నుండి ఇప్పటి వరకు దాదాపు రూ.1000 పెరిగినట్లు వ్యాపారస్తులు తెలిపారు .ఈ నెల చివరి నాటికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.6,850 కు చేరుతుందని ఆశిస్తున్నారు. దీనితో పసుపు స్టాక్ పెట్టేవారు కొనుగోలు జరుపుతున్నారు. ఎగుమతికి బంగ్లాదేశ్ నుండి ఆర్డర్లు కూడా వచ్చినట్లు తెలిసింది. సోమవారం ధరలు పసుపు కొమ్ముల కనిష్ట ధర రూ.5400, గరిష్ట ధర రూ.6,400 సగటు ధర రూ.5,975. దుంపలు కనిష్ట ధర రూ.5,400, గరిష్ట ధర రూ.6009 కాగా సగటు ధం రూ.5,800 పలికాయి.

గుంటూరు ఛానల్‌లో తూటుకాడను తొలగించండి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

గుంటూరు ఛానల్ లో పేరుకుపోయిన తూటు కాడను తొలగించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ డిమాండ్ చేశారు. చిన్న కాకానిలో సోమవారం గుంటూరు ఛానల్ ను ఆయన పరిశీలించారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ, ఆం ధ్రప్రదేశ్ రైతు సంఘం మంగళగిరి నియో జకవర్గ అధ్య క్షుడు వెంకటేశ్వరరావు సచివాలయం అధికారు లకు, కలెక్టర్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించు కోవడం లేదని మండిపడ్డారు. తూటుకాడ పూర్తిగా నిండి పోవడంతో వ్యవసాయ పనుల నిమిత్తం ఉప యోగించుకుంటానికి కూడా లేకుండా పోయిందని అన్నారు. గుంటూరు ఛానల్‌లో గుర్రపు డెక్క, తూటు కాడ పేరుకుపోవడంతో అందులోని నీరు మురుగు నీరుగా మారిపోయిందని అదే నీటిని ప్రజలకు తాగు నీరుగా అందిస్తున్నారని, ఆ నీరు కంపు కొడుతోందని

గుంటూరు ఛానల్‌ను పరిశీలిస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ తదితరులు

అన్నారు. పది రోజుల్లో తూటుకాడను తొలగించని పక్షంలో గ్రామస్తులందరితో కలిసి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యా లయాలను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. పరిశీలిం చిన వారిలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎ.ప్రభాకర్, జోహార్ జానీ, జె.శంకరరావు, పి.రాధాకృష్ణ, పి. మరియ దాసు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు

ప్రజాశక్తి - తాడికొండ

ప్రతి ఒక్క విద్యార్థి ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధి రోహించాలని నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ కోరారు. సోమవారం స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలలో అమ్మఒడి పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి విద్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నారని నాడు నేడు కింద కోట్లు వెచ్చించినట్లు తెలి పారు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధి స్తున్నారని కొనియాడారు. ఎండిఒ ఎ.దీప్తి, ఎంఇఒ తెనాలి ఇందిర, సర్పంచ్ టి.సరోజిని, ఎం.రత్నకుమారి, మాజీ ఎంపిపి బి.పున్నారావు, ప్రిన్సిపాల్ ఎన్.మరియదాసు, ఎపిఎం పి.సాంబశివరావు పాల్గొన్నారు.

పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు మున్సిపల్ పరిధిలోని సోమవారం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ ఆధ్వర్యంలో జరిగినది దీనిలో భాగంగా సచివాలయం 11 వార్డులు 20,22 రావు గారి బజారు, ముబారక్ నగర్, కమ్యూనిటీ హాల్ బజారు, వాటి అనుబంధ బజారులలో మురుగు కాలువల పూడిక తీతలు, పిచ్చి మొక్కలు తొలగించారు. మురుగు కాల్వల్లో దోమల మందును చల్లించారు. ఈ సంద

ర్భంగా కమిషనర్ నయీమ్ అహ్మద్ మాట్లాడుతూ గృహ యజమానులు రోడ్లపై చెత్త వేయొద్దని, మున్సి పల్ సిబ్బంది వచ్చినప్పుడు వారికి అందించి పట్టణ పారి శుధ్యానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ ను నిషేధిద్దాం

ప్రజాశక్తి-తెనాలి

ప్రజా చైతన్యం కోసం ప్లాస్టిక్ నిషేధం అవశ్యకతను వివ రిస్తూ మారిస్ పేట యన్ సి ఆర్ యన్ యమ్ హైస్కూలు ఎన్‌సి సి ఎయిర్ వింగ్ విద్యార్థులు ప్ల కార్డులు చేతబూని సోమవారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఎన్‌సిసి ఉపాధ్యాయులు పి .భాస్కరరావు నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత వేజళ్ల ఉమా మహేశ్వర్ ప్రదర్శనలో పాల్గొని ప్లాస్టిక్ వాడకం వలన నష్టాలను వివరించారు. సంచుల తయారీలో ఉపయోగించే కాడ్మియం, సీసం వంటి విషపూరిత రసాయనాలు ఆహార పదార్థాలను కలు షితం చేస్తాయని చెప్పారు. కాడ్మియం వలన వాంతులు, గుండె పరిమాణం పెద్దది కావడం జరుగుతుందని, ఎక్కువ కాలం సీసానికి గురైతే, మెదడులోని కణాలు క్షీణించి పోతాయని వివరించారు.వేజళ్ల వెంకట సుబ్బారావు మెమో రియల్ ఎడ్యుకేష నల్ ట్రస్టు ద్వారా 800 చేతి గుడ్డ సంచులను తయారు చేయిం చి, ఎన్‌సిసి విద్యార్థుల ద్వారా పట్టణ ప్రజలకు ఉచితంగా అంద జేశారు.

మసీదుల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

ప్రజాశక్తి-తెనాలి

ముస్లిం మైనారిటీల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, మసీదుల్లో మౌలిక వసతుల కల్పనలో కూడా ముందుంటుందని ఎమ్మెల్యే అన్నా బత్తుని శివకుమార్ అన్నారు. నియోజకవర్గంలో ఉన్న మసీదుల అవసరాలు ఆయా మసీదుల కమిటీలు ఎదుర్కొంటున్న సమస్యలు జిల్లా జిల్లా వక్ఫ్ బోర్డు ఛైర్మన్ దృష్టికి తీసుకు వెళ్ళేందుకు కృషి చేస్తామన్నారు. సోమవారం పట్టణంలోని శివాజీ చౌక్ వద్ద గల జామియా మసీదులో 'హర్ దిల్ మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్ కే సాథ్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్క రించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణం లోని 24 మసీదులతో పాటు గ్రామీణ ప్రాంత మసీ దులు, కొల్లి పర మండలంలోని మసీదు కమిటీలు ఆయా మసీ దుల్లో సమస్యలతో నివేదికలు రూపొం దించి వక్ఫ్ బోర్డు ఛైర్మన్ పర్యటనలో అందజేయా లన్నారు. కార్య క్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు ఛైర్మన్ షేక్ జిలాని, జిల్లా వైసిపి నాయకులు హబీబుల్లా, స్థానిక ముస్లిం నాయ కులు డాక్టర్.రియాజ్ ఖాన్, ఈద్గా కమిటి అద్యక్షులు సయ్యద్ గౌస్ పాల్గొన్నారు,

పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే శివకుమార్

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి -మంగళగిరి

పాత మంగళగిరి శ్రీ కృష్ణ చైతన్య వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు సోమవారం దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. నూతక్కికి చెందిన పెదవడ్లపూడి మాజీ పంచాయతీ కార్యదర్శి రాఘవరపు శివ ప్రసాద్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆయా కార్యక్రమాలు నిర్వహించారు. కాపు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆయా కార్యక్రమాలను ప్రారంభించారు.

10,11తేదీల్లో కలెక్టరేట్ వద్ద

అంగన్వాడీల 36 గంటల నిరవధిక నిరసన

గుంటూరులో యూనియన్ ఆధ్వర్యంలో సిడిపిఒకు వినతి

ప్రజాశక్తి-గుంటూరు :అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జూలై 10, 11 తేదీల్లో 36 గంటల పాటు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరవధిక నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) నగర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.దీప్తి మనోజ తెలిపారు. ఈ మేరకు సిడిపిఒగాకు యూనియన్ నాయకులు సోమవారం వినతిపత్రం అందచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా అంగన్వాడీలకు తెలంగాణ ప్రభుత్వం కంటే వెయ్యి రూపాయలు అదనంగా జీతాలు చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర సమస్యల పరిష్కారం కోసం ఈ నిరసన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. కలెక్టరేట్ వద్ద జరిగే నిరసనలో జిల్లాలోని అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బాజీబి, సంకీర్తి, భారతి, దేవమణి తదితరులు పాల్గొన్నారు.

విడదల రజినీకి అవగాహన లేదు

మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు

ప్రజాశక్తి-గుంటూరు

విడదల రజినీకి వైద్య ఆరోగ్యశాఖపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చారని చంద్రబాబు, లోకేష్‌పై మంత్రి రజని చేసిన వ్యాఖ్యలపై పుల్లారావు ఘాటుగా స్పందించారు. గుంటూరులో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖకు ఏ ప్రభుత్వమైనా సాధ్యమైనంత వరకూ డాక్టరునే మంత్రిగా నియమిస్తారని, కానీ అవగాహన లేని మంత్రి విడదల రజిని అన్నారు. విడదల రజినీకి ఆ శాఖపై ఎంత పట్టు ఉంది, ఆ శాఖలో జరుగుతున్న అవినీతి, పోస్టుల నియామకంలో జరుగుతున్న అవినీతి, అరాచకాలు అందరికీ తెలిసిందేనని అన్నారు. ఆరోగ్యశ్రీ అని చెప్పి, డబ్బులు లేకుండా ఎన్ని హాస్పిటల్స్‌లో వైద్యం చేస్తున్నారో చెప్పాలన్నారు. ఆరోగ్యశ్రీ పేరుతో వైద్యం చేసి, తర్వాత డబ్బులు వసూలు ఎంత తీసుకున్నారో తెలిస్తే విడదల రజిని మళ్లీ ఆశాఖకు మంత్రి కాలేరన్నారు. ఆరోగ్యశ్రీలో నమోదు చేస్తూ, డబ్బులు కూడా తీసుకుంటున్నారన్నారు. రూ.70వేలు, రూ.80వేలు తీసుకోకుండా స్టంట్‌లు వేసిన హాస్పిటల్స్ ఉంటే చూపించాలని సవాల్ చేశారు. తాను చేసే చాలెంజ్‌కే దిక్కు లేదని, చంద్రబాబు నాయుడు, లోకేష్‌పై చాలెంజ్ విసిరే అర్హత ఉందా అని ప్రశ్నించారు. టిడిపి ప్రభుత్వంలో సిఎం రిలీఫ్ ఫండ్ ఎంత ఇచ్చారో, ప్రస్తుత ప్రభుత్వంలో ఎంత ఇచ్చారో సమీక్ష చేయాలన్నారు. ఎన్‌టిఆర్ వైద్యం కింద ఎంత ట్రీట్‌మెంట్ ఇచ్చారో, ఇప్పటి ఆరోగ్యశ్రీలో ఎలా ఇస్తున్నారో సమీక్షించుకోవాలన్నారు. డబ్బులు లేకుండా చికిత్స అందించలే నందుకు, ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు చేయలేనందుకు ప్రభుత్వం సిగ్గు పడాలన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థిని అభినందిస్తున్న కమిషనర్

విద్యార్థులు చదవుతో పాటు తమకు నచ్చిన క్రీడల్లోనూ పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. సిలంబం పోటీల్లో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి, బంగారు పతకం సాధించిన మున్సిపల్ స్కూల్ విద్యార్థి దిలీప్ కుమార్‌ను సోమవారం కమిషనర్ అభినందించారు. ఈ సంద ర్భంగా కమిషనర్ మాట్లాడు తూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా పాల్గొంటే శారీరక, మానసిక ఆరోగ్యం కలిగి ఉంటారన్నారు. సిలంబం అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో జొన్నలగడ్డ గ్రామంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి సిలంబం పోటీల్లో జిఎంసి పరిధిలోని కెఎస్‌ఆర్టిఎంసిహెచ్ స్కూల్ విద్యార్థి ఎం.దిలీప్ కుమార్ బంగారు పతకం సాధించి, ఈనెల 9న వైజాగ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అవ్వడం అభినందనీయమన్నారు. దిలీప్ కుమార్‌కు ఉచితంగా శిక్షణ ఇచ్చిన సిలంబం కోచ్ వర్మ రుద్రరాజును కమిషనర్ అభినందించారు.

ఆర్‌జెడికి వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

గ్రేడ్-2 హెచ్ఎం ప్రమోషన్లలో న్యాయం చేయాలి

ఆర్‌జెడికి ఆదివాసీ ఉద్యోగుల సంఘం వినతి

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల పదోన్నతులలో అర్హత కలిగిన ఎస్టీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని అఖిల భారత ఆదివాసీ ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు కోరారు. ఈమేరకు అసోసియేషన్ నాయకులు సోమవారం పాఠశాల విద్య గుంటూరు ఆర్‌జెడి వి.ఎస్.సుబ్బారావుకు గుంటూరులోని ఆర్‌జెడి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఇటీవల ఎంఇఒ-2 పోస్టులకు ఎస్టీ హెచ్‌ఎంలు ఐదుగురు బదిలీ అయ్యారని, ఆ ఖాళీలను అర్హత కలిగిన ఎస్టీ ఉపాధ్యాయులతో మాత్రమే భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో పాలపర్తి బాలాజీ, కొండారెడ్డి శ్రీనివాస్, ఆంటోనీ, వెంకటేశ్వరరావు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

బడి బయట పిల్లల్ని బడిలో చేర్పించాలి

జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - గుంటూరు

వీడియోకాన్ఫరెన్స్‌లో సమీక్షిస్తున్న కలెక్టర్

జిల్లాలో బడి బయట పిల్లలు లేకుండా డ్రాప్ అవుట్స్ అయిన పిల్లలను గుర్తించి వెంటనే వారిని పాఠశాలలో చేర్పించేలా సచివాలయంలోని ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, ఎంఈవోలు, జిల్లా విద్యాశాఖ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి విద్యాశాఖ, వైద్యారోగ్యశాఖ, మహిళ శిశు సంక్షేమ శాఖ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటిలో ఐదు సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లల విద్యకు సంబంధించి వాలంటీర్ల సర్వే గురువారం నాటికి పూర్తి అయ్యేలా సచివాలయ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, ఎంఈవోలు చర్యలు తీసుకోవాలన్నారు. చైల్డ్ ఇన్ఫోలోని డ్రాప్ అవుట్స్ పిల్లలను శనివారం నాటికి సంబంధిత సచివాలయ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు సంబంధించి ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, ఎఎన్ఎం, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మహిళ పోలీసులు నిర్దేశించిన విధంగా పాఠశాలలను సందర్శించి చేసి వివరాలను ఆన్లైన్‌లో అప్‌లోడ్ చేసేలా ఎంఈవోలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో జగనన్న విద్యా కానుక కిట్లు విద్యార్థులకు నూరు శాతం పంపిణీ చేసి, ఈకేవైసీ పూర్తిచేసి ఎంఈవోలు శనివారం పూర్తి నివేదిక అందించాలన్నారు. పాఠశాలలో నాడు-నేడు ద్వారా జరుగుతున్న మౌలిక సౌకర్యాల పెండింగ్ పనులు వెంటనే పూర్తి అయ్యేలా ఇంజినీరింగ్ అధికారులను సమన్వయం చేసుకుంటూ ఎంఈఓలు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిదిలో ఎన్‌సిడి సర్వే సక్రమంగా నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో రక్తహీనత ఉన్న గర్భిణీలు, బలహీనంగా ఉన్న పిల్లలు ప్రతిరోజు ఖచ్చితంగా పౌష్టికాహారం తీసుకునేలా సీడీపీవోలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యాశాఖ అధికారిణి శైలజ, సమగ్ర శిక్ష ఏపీడీ విజయలక్ష్మి, డీఎంఅండ్ హెచ్‌ఓ డా. శ్రావణ బాబు, ఐసీడీఎస్ పీడీ మనోరంజని పాల్గొన్నారు.

4.570 కిలోల గంజాయి స్వాధీనం - నలుగురు అరెస్టు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మీడియతో మాట్లాడుతున్న గుంటూరు జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్

అల్లూరి సీతారామరాజు పాడేరు జిల్లా చింతపల్లి నుంచి గంజాయి కొనుగోలు చేసి గుంటూరు జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో విక్రయిస్తున్న నలుగుని నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 4.570 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్ సోమవారం మీడియాకు తెలిపారు. తాడేపల్లి మండలం ప్రాతూరుకి చెందిన బండ్ల ప్రశాంత్, చిర్రావూరుకు చెందిన మొండితోక రత్నతేజ, మొండితోక రజనీ కుమార్, నెల్లూరుజిల్లా సూళ్లూరు పేట వాసి ఈదులమూడి సాత్విక్ స్థానిక కంతేరు రోడ్డులో అరెస్టు చేశామన్నారు. మంగళగిరి రూరల్ ఎస్ఐ జె. క్రాంతి కిరణ్‌కి వచ్చిన సమాచారము మేరకు నిందితులను అరెస్టు చేశారు. నల్గురు నిందితులు చెడు వ్యసనాలకు బానిసలై చింతపల్లి మండలము దేగలవానిపాలెం గ్రామానికు వెళ్ళి గంజాయిని కొనుగోలు చేసి తాడేపల్లి,మంగళగిరి ప్రాంతాల్లో యువకులకు విక్రయిస్తుండగా పట్టుకున్నట్టు తెలిపారు. మంగళగిరి డిఎస్‌పి రాంబాబు, సిఐ వి.భూషణం కేసు దర్యాప్తుచేస్తున్నారు.

జిజిహెచ్‌లో సమస్యలపై దృష్టి

పలు వార్డులను తనిఖీచేసిన సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ సోమవారం పలు వార్డులను తనిఖీలు చేశారు. సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ఈ తనిఖీలు చేశారు. ఆసుపత్రి లో సమూలమైన మార్పులు తీసుకుని వచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. సూపరింటెండెంట్ కార్యాలయం నుంచి కాన్పుల వార్డు వరకు సెక్యూరిటీ సిబ్బంది కనిపించక పోవడం తో సెక్యూరిటీ సూపర్ వైజర్ల పై ఆయన మండిపడ్డారు. విధులకు ఎప్పుడు వస్తున్నారు.. పని విధానాల పై రిజిస్ట్రర్ మెయింటైన్ చేస్తున్నారా లేదా అని ఆయన ఆరా తీశారు. సార్జన్ సెక్యూరిటీ గార్డులు, శానిటేషన్ సిబ్బంది ఎప్పుడు వస్తున్నారు ఎంత మంది వస్తున్నారో చెప్పలేక బిక్క మొఖం వేశారు. సెక్యూరిటీ సూపర్ వైజర్ల పర్యవేక్షణ విధానంలో మార్పులు తీసుకుని రావాలని నర్సింగ్ సూపరింటెండెంట్, ఆర్ యం ఓ కు ఆయన ఆదేశాలు జారీ చేశారు. అక్కడ నుంచి కాన్పుల వార్డు ను తనిఖీ చేశారు. అక్కడ గర్భిణులు పడుతున్న ఇబ్బందులను గుర్తించారు. లేబర్ వార్డుకు వచ్చిన గర్భిణీ లను ఎందుకున్నారంటు ఆయన ప్రశ్నించారు. బిపి కోసం వచ్చామని చెప్పడం తో అక్కడ ఉన్న వైద్య సిబ్బందికి రోగులను అటు ఇటు తిప్పవద్దని అయన సూచించారు. కాన్పుల వార్డులో వీల్ చైర్లు, స్ట్రెచర్లు ఉండటాన్ని ఆ యన గమనించారు. ఇలా ఉంటే రోగులను వార్డులకు తీసుకుని రావాలంటే కష్టంగా ఉండదా అంటూ ప్రశ్నిం చారు. వెంటనే రోగులకు అందుబాటులో ఉంచాలని నర్సింగ్ సిబ్బందికి ఆదేశించారు. కాన్పుల వార్డులోని రెండు ఆపరేషన్ దియేటర్లలో ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆపరేషన్ లు చేస్తుండటాన్ని ఆయన అభినందించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకుని వస్తే పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. సూపరింటెండెంట్ వెంట సివిల్ సర్జన్ ఆర్ యం ఓ డాక్టర్ సతీష్ కుమార్ ఉన్నారు.

జిజిహెచ్‌కు మెడికల్ కిట్స్ అందచేత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి అనాస్థిషియా విభాగంకు మమతా మెడికల్స్ అధినేత చంద్ర శేఖర్ రూ. 50 వేల విలువ గల పరికరాలను సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ కు అందచేశారు. అనాస్థిషియా విభాగం రోగుల కోసం బి పి ఆపరేటర్లు, రెండు గ్లౌజ్ మీటర్లు, సర్జికల్ మాస్కులు, సిరంజి లు ఫేస్ మాస్కు అందచేశారు. కార్యక్రమం లో డాక్టర్ బి వి మహేష్ బాబు, డాక్టర్ పోలయ్య, డాక్టర్ శ్యాం కుమార్, డాక్టర్ నాగబాబు, చంద్రశేఖర్ లు పాల్గొన్నారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి సహాయం చేయడం అభినందనీయమన్నారు.